కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల
సోమవారం 26, అక్టోబర్ 2026 | 16 పేజీలు

## అమరుల త్యాగాలు చిరస్మరణీయం..!



16లో



తాటిపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్

25 ఎకరాల్లో 2,600 మంది విద్యార్థులకు ఆధునిక వసతులు

18 నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం

# పేద విద్యార్థులకు కార్పొరేట్ చదువులు..!

2లో





జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త: పేదరికం చదువుకు అడ్డుకాకూడదు.. ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్య అందాలి.. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకోవాలి. ఈ లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు ఆదివారం రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ విద్యా సముదాయం అందుబాటులోకి వస్తే వేలాది మంది విద్యార్థులకు ఆధునిక వసతులతో విద్యనభ్యసించే అవకాశం కలగనుంది.

సిబిసిఐడి గుప్పిట్లో..

## రాష్ట్ర మిల్లర్ల చీకటి దందా...?

**56**మిల్లుల గుర్తింపు..

**16**మందిని అదుపులోకి తీసుకున్న అధికారులు..

జమ్మికుంట, హుజురాబాద్ మిల్లర్ల గుండెల్లో.. పరిగెడుతున్న రైళ్లు..




5లో

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి రైతన్నలు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను దళారుల పాలు కాకుండా ఎంఎస్‌పి ధరలకు నేరుగా రైతుల నుండి కొనుగోలు చేసి, రైస్ మిల్లర్లకు సిఎంఆర్ కింద అంటగట్టడంతో.. కొండ నాలుకకు మందు వేస్తే.. ఉన్న నాలుక ఊడిపోయినట్లు.. ప్రభుత్వం నమ్ముకున్న రైస్ మిల్లర్లే.. దళారులుగా అవతారమెత్తి.. లక్షలాది క్వింటాళ్ల, సన్న, దొడ్డు రకం వరిధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు అమ్ముకుని సంవత్సరాల తరబడి సర్కార్‌కు చుక్కలు చూపిస్తున్నారు.

ఇన్‌చార్జుల పాలన..

## తంగళ్లపల్లికి శాపం!

కీలక పోస్టుల్లో పూర్తిస్థాయి అధికారులు కరువు

రెవెన్యూ సమస్యలకు మోక్షమెప్పుడు?..

నిలిచిన అభివృద్ధి పనులు కార్యాలయాల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు.. స్పందించని ఉన్నతాధికారులు?

2లో



తంగళ్లపల్లి, ప్రభాతవార్త: మండల స్థాయి పాలనకు కీలకమైన అధికారులే లేకపోతే ప్రజా సమస్యలు పరిష్కారమయ్యేదెలా? ధ్రువీకరణ పత్రాల నుంచి భూ వివాదాల వరకు.. గ్రామాల్లో అభివృద్ధి పనుల నుంచి ప్రభుత్వ పథకాల అమలు వరకు ప్రతి అంశంలోనూ అధికారుల పాత్ర కీలకం. అలాంటి బాధ్యతాయుతమైన పోస్టుల్లో పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండలంలో పరిపాలన గాడి తప్పుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# పేద విద్యార్థులకు కార్పొరేట్ చదువులు!

### తాటిపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్

### 25 ఎకరాల్లో 2,600 మంది విద్యార్థులకు ఆధునిక వసతులు

### 18 నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త:** పేదరికం చదువుకు అడ్డుకాకూడదు.. ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్య అందాలి.. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకోవాలి. ఈ లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు ఆదివారం రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ విద్యా సముదాయం అందుబాటులోకి వస్తే వేలాది మంది విద్యార్థులకు ఆధునిక వసతులతో విద్యనభ్యసించే అవకాశం కలగనుంది.

### పేదింటి బిడ్డలకు నాణ్యమైన విద్య .....

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కలిసి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించి వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని, ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్య అందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానం విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైందని గుర్తుచేసిన మంత్రి.. పేద ప్రజలకు అందించగలిగే అత్యంత విలువైన సంపద విద్యేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులంతా ఒకే ప్రాంగణంలో విద్యనభ్యసించేలా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు వివరించారు.

### ఒకే ప్రాంగణంలో అన్ని వసతులు .....

తాటిపల్లిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 2,600 మంది విద్యార్థులకు విద్యనందించేలా ప్రణాళిక రూపొందించారు. ఏడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఆధునిక తరగతి గదులు, క్రీడా మైదానాలు, గ్రంథాలయం తదితర సదుపాయాలు కల్పించనున్నారు. నిర్మాణ పనులను 18 నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. గతంలో గురుకుల విద్యాసంస్థల్లో సొంత భవనాలు, మౌలిక సదుపాయాల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని 326 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో కేవలం 26 పాఠశాలలకే సొంత భవనాలు ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితులను మార్చేందుకు ఆధునిక సాంకేతికతతో విద్యా సముదాయాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి కనీసం పది ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో తరగతులు ప్రారంభించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పుస్తకాలు, యూనిఫాంలు అందించడంతోపాటు డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు వివరించారు. గురుకులాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరిగేలా గ్రీన్ ఛానల్ విధానం అమలు చేస్తున్నామని చెప్పారు.

### సంక్షేమం.. అభివృద్ధికి సమ ప్రాధాన్యం

ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పెట్టుబడి సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. 25 లక్షల మంది రైతులకు రూ.20 వేల కోట్ల మేర రుణమాఫీ చేశామని, రైతు భరోసా సాయాన్ని ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచామని తెలిపారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామని, యువతకు ఉపాధి కల్పించే దిశగా 75 వేల ఉద్యోగ నియామకాలు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ..... కరువును సమష్టిగా ఎదుర్కోవాలి .... సూపర్ ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రకృతి పరిస్థితులను రాజకీయాలతో ముడిపెట్టి విమర్శలు చేయడం సరికాదన్నారు. రైతులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అందరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. తెలంగాణ జలసిరి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో నీటి నిల్వలను పెంచేందుకు కుంటలు, వ్యవసాయ భూముల వద్ద పంట కుంటలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. భూగర్భ జలాల పెంపునకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో విద్యారంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముందుకు సాగుతున్నారని తెలిపారు. తాటిపల్లి ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని 18 నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ధర్మపురి బస్ డిపోను మంజూరు చేసినందుకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వివిధ మతాల పెద్దల సమక్షంలో శంకుస్థాపన నిర్వహించడం సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

### జిల్లాలో విద్యకు రూ.500 కోట్లతో పనులు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. తాటిపల్లిలో 25 ఎకరాల్లో నిర్మించనున్న విద్యా సముదాయం వేలాది మంది విద్యార్థులకు ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతులు కల్పించడంతోపాటు యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ.. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో విద్యారంగ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో రూ.10 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టగా, జిల్లాలో మొత్తం రూ.40 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రూ.50 కోట్లతో కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, కోరుట్లలో రూ.45 కోట్లతో జవహర్ నవోదయ విద్యాలయ నిర్మాణ పనులు కూడా ప్రారంభమైనట్లు వివరించారు. ధర్మపురిలో యంగ్ ఇండియా కార్యక్రమం కింద పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. గత రెం డేళ్లలో జిల్లాలో విద్యారంగ మౌలిక సదుపాయాల కోసం సుమారు రూ.500 కోట్ల విలువైన పనులు జరుగుతు న్నాయని పేర్కొన్నారు.జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. జగిత్యాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంతిరెడ్డిని కోరగా, రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడం సంతోష కరమ న్నారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు ఒకే ప్రాంగణంలో ఆధునిక వసతులతో విద్య నభ్యసించడం సామాజిక ఐక్యతకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసన్నాంబ, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి, గ్రంథా లయ సంస్థ చైర్మన్ దినేష్, ఇతర ప్రజాప్రతినిధులు, సర్పం చులు, ఉపసర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.


**తెలంగాణ గ్రామీణ బ్యాంక్**
**(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో)**
**గర్షకుర్తి బ్రాంచ్౦౦99, ప్రాంతం: జగిత్యాల జిల్లా: కరీంనగర్,**
**తెలంగాణ 505445 మొబైల్: 9491041832**

**స్వాధీనపు నోటీసు (నిబంధన 8 (i) స్థిరాస్తి కొరకు)**

ఏలయనగా కింద సంతకం చేసిన నేను, **తెలంగాణ గ్రామీణ బ్యాంక్** యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో కలిపి సెక్షన్ 13 (2) కింద సంక్రమించిన అధికారాలను ఉపయో గించి, **తేదీ 31.07.2026** న ఒక డిమాండ్ నోటీసును జారీ చేశాను. ఆ నోటీసులో, రుణగ్రహీత **తల్లెన శ్రీమతి తుమికి భావన భర్త వాయు కుమార్ మరియు శ్రీ తుమికి వాయు కుమార్ కుమారుడు తండ్రి వెంకటయ్య,** నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తం **రూ. 18,83,507/- (పద్దెనిమిది లక్షల ఎనభై మూడు వేల ఐదు వందల ఏడు రూపాయలు మాత్రమే)** ను లోపల తిరిగి చెల్లించాలని కోరడమైనది. సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులు. రుణ గ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో కలిపి సదరు చట్టంలోని సెక్షన్ 13(4) కింద తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, ఈ క్రింద సంతకం చేసిన వారు **2026వ సంవత్సరం అక్టోబర్ 21వ తేదీన,** ఇక్కడ క్రింద వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత / హామీదారుకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయ డమైనది. ముఖ్యంగా రుణగ్రహీత / హామీదారు మరియు సాధారణ ప్రజలు ఈ ఆస్తితో ఎటు వంటి లావాదేవీలు జరపవద్దని ఇందు మూలంగా హెచ్చరించడమైనది. ఆస్తితో జరిపే ఏ లావా దేవీ అయినా **రూ.18,83,507/- (పద్దెనిమిది లక్షల ఎనభై మూడు వేల ఐదు వందల ఏడు రూపాయలు మాత్రమే)** మొత్తానికి తెలంగాణ గ్రామీణ బ్యాంకు చార్జీకి లోబడి ఉంటుంది మరియు ఇంకా హామీగా ఉంచిన ఆస్తులను విడిపించుకోవడానికి అందుబాటులో ఉన్న సమయా నికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలను రుణగ్రహీత దృష్టికి తీసుకువస్తున్నాము.

**స్థిరాస్తి యొక్క వివరణ**

**302.50 చదరపు గజాలు లేదా 252.92 చదరపు మీటర్ల** విస్తీర్ణం గల ఖాళీ స్థలం. ఇది కరీంనగర్ జిల్లా, గంగాధర మండలం, ఉప్పరమల్లియల్ గ్రామంలోని సర్వే నెం. 713/E/F/1లో ఉంది. ఇది ఉప్పరమల్లియల్ గ్రామ పంచాయతీ పరిధిలోకి వస్తుంది మరియు గంగాధర ఉపజిల్లా రిజిస్ట్రేషన్ మరియు కరీంనగర్ జిల్లా రిజిస్ట్రేషన్ పరిధిలోకి వస్తుంది.సరిహద్దులు: తూర్పు: తుమికి పవన్ గారి స్థలం పడమ: తుమికి మారుతి రాజు గారి స్థలంఉత్తరం: దాత గారి స్థలందక్షిణం: సిసి రోడ్డు.

**తేదీ: 21.10.2026** — బ్రెస్ కొరొబకుర్తి, అధీకృత అధికారి




### ఇన్‌చార్జుల పాలన..

# తంగళ్లపల్లికి శాపం!

### కీలక పోస్టుల్లో పూర్తిస్థాయి అధికారులు కరువు

### రెవెన్యూ సమస్యలకు మోక్షమెప్పుడు?..

### నిలిచిన అభివృద్ధి పనులు కార్యాలయాల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు.. స్పందించని ఉన్నతాధికారులు?

**తంగళ్లపల్లి, ప్రభాతవార్త:** మండల స్థాయి పాలనకు కీలకమైన అధికారులే లేకపోతే ప్రజా సమస్యలు పరిష్కారమయ్యేదెలా? ధ్రువీకరణ పత్రాల నుంచి భూ వివాదాల వరకు.. గ్రామాల్లో అభివృద్ధి పనుల నుంచి ప్రభుత్వ పథకాల అమలు వరకు ప్రతి అంశంలోనూ అధికారుల పాత్ర కీలకం. అలాంటి బాధ్యతాయుతమైన పోస్టుల్లో పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండలంలో పరిపాలన గాడి తప్పుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలానికి కీలకమైన తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) పోస్టులు ఇన్‌చార్జుల చేతుల్లో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు.

### రెవెన్యూ సమస్యలు పరిష్కారమయ్యేదెప్పుడు?

మండలంలో పూర్తిస్థాయి తహసీల్దార్ లేకపోవడంతో రెవెన్యూ వ్యవహారాల నిర్వహణపై ప్రభావం పడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. భూ వివాదాలు, భూ భారతి సంబంధిత సమస్యలు, ఇతర రెవెన్యూ వ్యవహారాల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని ప్రజలు చెబుతున్నారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు వాటి మంజూరు కోసం రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చినా సంబంధిత అధికారి అందుబాటులో లేకపోవడం, దరఖాస్తులపై నిర్ణయాలు ఆలస్యమవడం ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొంటున్నారు.

### అభివృద్ధి పనులపై ప్రభావం!

మరో కీలకమైన ఎంపీడీవో పోస్టులోనూ పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో మండల పరిషత్, గ్రామ పంచాయతీల పాలనపై ప్రభావం పడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పథకం అమలు, పల్లె ప్రగతి నిధుల వినియోగం, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనుల పురోగతిపై పర్యవేక్షణ కీలకంగా మారింది. అయితే పూర్తిస్థాయి అధికారి లేకపోవడం, ఇతర బాధ్యతల నిర్వహణతో ఇన్‌చార్జి అధికారులపై పని భారం పెరగడం వంటి అంశాలు పాలనాపరమైన జాప్యానికి కారణమవుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఫలితంగా గ్రామాల్లో చేపట్టాల్సిన కొన్ని పనులు నత్తనడకన సాగుతున్నాయని, నిధుల సద్వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

### సమన్వయ లోపంతో ఇక్కట్లు

మండల స్థాయిలో వివిధ శాఖల మధ్య సమన్వయం, ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు, క్షేత్రస్థాయిలో సమస్యల గుర్తింపు, ప్రభుత్వ పథకాల అమలు పర్యవేక్షణ నిరంతరం జరగాల్సి ఉంటుంది. కీలక పోస్టుల్లో పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో ఈ ప్రక్రియకు ఆటంకాలు ఎదురవు తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంటోందని స్థానికులు అంటున్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ఫలాలు సకాలంలో అందేలా చూడటంతోపాటు, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

### కలెక్టర్ స్పందించాలి

జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న తంగళ్లపల్లి మండలంలోనే కీలక అధికారుల కొరతతో ఇలాంటి పరిస్థితులు నెలకొనడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి వ్యవహా రాలు సజావుగా సాగాలంటే పూర్తిస్థాయి అధికారులు అందుబాటులో ఉండాల్సిందేనని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తంగళ్లపల్లి మండలానికి పూర్తిస్థాయి తహసీల్దార్, ఎంపీడీవో లను నియమించాలని కోరుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, నిలిచిపోయిన అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు, రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# రాఘవపూర్ వివాదాల్లో ఎమ్మెల్యే పేరును ప్రస్తావించడం సరికాదు

## మాజీ సర్పంచ్ ఆడేపు వెంకటేష్, రంగాపూర్ సర్పంచ్ గంట రమేష్

## సీసీ కెమెరాల తొలగింపు, యువకుడిపై దాడి ఆరోపణలపై విచారణకు డిమాండ్

**పెద్దపల్లి, ప్రభాతవార్త:**

రాఘవపూర్‌లో ఇరువర్గాల మధ్య జరుగుతున్న గొడవలకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును బాధ్యుడిగా చూపడం సరికాదని రంగాపూర్ సర్పంచ్ గంట రమేష్ అన్నారు. ఆదివారం పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ వివాదాలపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ సర్పంచ్ ఆడేపు వెంకటేష్ మాట్లాడుతూ గ్రామంలో కల్లెపల్లి అశోక్, మోదుంపల్లి శ్రావణ్, నవీన్ గొడవలకు కారణమవుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేపై రాజకీయంగా బురదజల్లేందుకు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రోద్బలంతో వివాదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తొలగించిన ఘటనపై అధికారులు సమాధానం చెప్పాలని, వాటిని తొలగించినవారెవరో వెల్లడించాలని డిమాండ్ చేశారు. బిలాల్ అనే మైనారిటీ యువకుడిపై దాడి చేయడంతోపాటు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. గ్రామ గొడవలతో తనకు సంబంధం లేకున్నా తనపై ఆరోపణలు చేయడం వల్ల ఉద్రిక్తతలు పెరిగే ప్రమాదం ఉందని వెంకటేష్ అన్నారు. పోలీసులు ఇరువర్గాలను పిలిపించి మాట్లాడించి, తిరిగి గొడవలు చేయవద్దని హెచ్చరించినట్లు వివరించారు. సీఐ ప్రవీణ్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు చేయడాన్ని తప్పుబట్టారు. ఈ వివాదంతో ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదని గంట రమేష్ స్పష్టం చేస్తూ గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ముడుసు సాంబిరెడ్డి, సుంచు సదయ్య, కుమ్మరి తిరుమల్, రామస్వామి, సంజీవ్, అంజయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురిలో బస్ డిపో ఏర్పాటు చేస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్

**ధర్మపురి, ప్రభాతవార్త:**

ధర్మపురిలో బస్ డిపో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. డిపో నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు అందించాలని అధికారులకు సూచించారు. ధర్మపురి బస్‌స్టేషన్ ఆధునీకరణలో భాగంగా రూ. 2.57 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ..1993లో ప్రారంభమైన ఈ బస్‌స్టేషన్‌ను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ద్వారా ఇప్పటివరకు సుమారు 360 కోట్ల ప్రయాణాలు జరిగాయని, దాంతో వారికి రూ. 13 వేల కోట్లు ఆదా అయ్యాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యాలను విస్తరించడంతోపాటు ధర్మపురి నుంచి ముంబయికి బస్సు నడిపే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కరీంనగర్, జగిత్యాల, ధర్మపురి మధ్య రాత్రి వేళల్లోనూ బస్సులు నడిపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఎల్ నినో కారణంగా ప్రపంచ దేశాలు ఇబ్బందులు పడుతుంటే, బిఆర్ఎస్ నాయకులు మాత్రం అందుకు కారణం కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదమని మతిలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 2027 లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల కోసం గోదావరి తీరంలోని పుణ్యక్షేత్రాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ధర్మపురి ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ. 10 కోట్లు, పుష్కర ఘాట్లు, బైపాస్ రహదారులు తదితర పనులకు సుమారు రూ. 226 కోట్లు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. పుష్కరాల సమయంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఈ పనులు దోహదపడతాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ బస్‌స్టేషన్ అభివృద్ధి పనులు పటిష్ఠంగా ఉండేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రయాణికులకు అవసరమైన తాగునీరు, పారిశుద్ధం, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలు సక్రమంగా అందేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి ,ఆర్ డి ఓ మధుసూదన్, ఆర్టీసీ బస్ భవన్ ఈడి రాజశేఖర్, కరీంనగర్ జోనల్ ఈ డి సోలోమన్, రీజనల్ మేనేజర్ రాజు, స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్టీసీ అధికారులు, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.







## నేరాలు-దారుణాలు



# మహిళా సర్పంచుల శిక్షణలో పాల్గొన్న జూలపల్లి సర్పంచ్ అనూష

## సమాచార హక్కు చట్టం, గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ వ్యవహారాలపై శిక్షణ

**జూలపల్లి, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో మూడు రోజులపాటు నిర్వహించిన మహిళా సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో పెద్దపల్లి నియోజకవర్గం పరిధిలోని జూలపల్లి గ్రామ సర్పంచ్ పాతకుల అనూష పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, గ్రామీణ అభివృద్ధి, గ్రామపంచాయతీల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై ఆమె అవగాహన పొందారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ శిక్షణలో సమాచార హక్కు చట్టం, గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ విధులు, గ్రామపంచాయతీల పరిపాలన, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం, ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించడం, పారదర్శకమైన పాలన అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన జూలపల్లి సర్పంచ్ పాతకుల అనూషకు నిర్వాహకులు సర్టిఫికెట్ అందజేశారు. ఈ శిక్షణ ద్వారా గ్రామాభివృద్ధికి అవసరమైన పరిపాలనా అంశాలపై మరింత అవగాహన పెంపొందించుకునే అవకాశం లభించింది. గ్రామపంచాయతీల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలకు చేరవేయడంలో ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

# ఇంటర్ ప్రవేశాలకు అక్టోబర్ 29 వరకు చివరి అవకాశం

## జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి దాసరి కల్పన

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: ఇంటర్మీడియట్‌లో చేరాలనుకునే విద్యార్థులకు అక్టోబర్ 29 వరకు చివరి అవకాశం కల్పించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి దాసరి కల్పన తెలిపారు. తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు 2026 అక్టోబర్ 26 నుంచి 29 వరకు 4 రోజుల పాటు ప్రభుత్వ అనుమతి పొందిన అన్ని కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకునేందుకు అవకాశం కల్పించారు. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ కళాశాలల్లో ప్రవేశాలు ఉచితంగా ఉంటాయని, ప్రైవేట్ కళాశాలల్లో రూ. 500 ఫైన్‌తో అడ్మిషన్లు పొందవచ్చని ఆమె పేర్కొన్నారు. గడువులోగా అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.



# పాటల ప్రయాణంలో రాజేందర్ మరింత ఉన్నతికి ఎదగాలి

## కళాకారులతోనే సమాజ చైతన్యం

## జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.





**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:** కవులు, కళాకారుల ద్వారానే సమాజ చైతన్యం సాధ్యమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. పట్టణం లోని స్థానిక దేవిశ్రీ గార్డెన్ లో ధర్మపురి మండలం నేరెళ్లకు చెందిన ప్రముఖ జానపద గాయకుడు పలిగిరి రాజేందర్ తను కళారంగంలో 25 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా పలిగిరి పాతికెళ్ళ కళా ప్రస్థానం పేరుతో కార్యక్రమం నిర్వహించగా వందల మంది కళాకారులూ, కళాభిమానులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఒక కళాకారుని ప్రస్థానంలో ఇంతమంది కళా కారుల అభిమానం సంపాదించుకోవడం, కళా కారులూ అందరు ఒక్క తాటిపైకి వచ్చి రాజేందర్ ను ఆశీర్వదించడం అభినందనీయం అన్నారు. కళాకారుల అట పాట ప్రజాప్రతినిధుల గెలుపులో సైతం ప్రముఖ పాత్ర పోషిస్తుందని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నారు. తెలంగాణ ఉద్యమం, సామాజిక ఉద్యమం, సామజిక చైతన్యం లో కళాకారుల పాత్ర మరువలేనిదని గుర్తు చేశారు. రాజేందర్ తో గత పదిహేనేళ్లుగా తనతో అనుబంధం ఉందని అయన ప్రతిభతోనే ఈ స్థాయికి ఎదగడం, దానివెనుక అయన కృషి , ఆటుపోట్లు ఎదుర్కొని నిలబడ్డ అయన పట్టుదల అభినందనీయం అన్నారు. భవిష్యత్ లో పలిగిరి రాజేందర్ మరిన్ని విజయాలు సాధించాలని, మరింత ఉన్నతి, పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. సమాజంలో కళాకారుల పాత్ర అనిర్వచనీయం అని, మన సంస్కృతి, సంప్రదాయాలని, అంతరించి పోతున్నా కళలను భావి తరాలకు అందించేందుకు ఇలాంటి వేడుకలు మరిన్ని జరగలిసిన అవసరం ఉందన్నారు. డీసీసీ అధ్యక్షులు గజేంగి నందయ్యా మాట్లాడుతూ పలిగిరి రాజేందర్ కళా రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా గ్రంథాలయా సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ మాట్లాడుతూ రాజేందర్ తన శిష్యుడు అని, అయన ఇంత ఉన్నతికి ఎదిగి, ఇంత గొప్ప కార్యక్రమం నిర్వహించుకోవడ అభినందనీయమని అన్నారు. ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన పలిగిరి రాజేందర్ మా ధర్మపురి నియోజకవర్గం, మండలం కు చెందిన వ్యక్తి కావడం మాకు గర్వకారణం అన్నారు. తన కళా ప్రస్థానంలో మరిన్ని విజయాలు సాధించి, మరింతగా పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడువాలా జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కవులు, కళాకారులను ప్రోత్సహిస్తూదని గుర్తు చేశారు. జగిత్యాల జిల్లా జానపదం దేశ విదేశాల్లో సైతం మారుమ్రోగడం జగిత్యాల జిల్లాకే గర్వకారణం అన్నారు. ప్రముఖ గాయకుడు పలిగిరి రాజేందర్ తన కళా ప్రస్థానంలో 25 ఏళ్ళు పూర్తి చేసుకోవడం సాధారనా విషయం కాదన్నారు. ఆ కళమ్మ తల్లీ ఆశీస్సులతో కళారంగంలో పలిగిరి రాజేందర్ మరింత ఎదగాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా పలిగిరి రాజేందర్ ను పలువురు కళాకారులూ, కళాభిమానులు, సినీ, జానపద కళాకారులూ, రాజేందర్ గురువులు, పుర ప్రముఖులు తదితరులు శాలువాలతో సత్కరించి, పుష్ప గుచ్చం అందించి, మెమెంటో లతో అభినందనలు తెలిపి ఆశీర్వాదాలు అందజేశారు. భవిష్యత్ లో తన కళా ప్రస్థానం మరింతగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ కమిటీ సభ్యులు బోగే అశోక్,(తొలిపొద్దు)కండ్లే అంజి,గుంపుల రమేష్, కూనమల్ల సుమన్, భూక్యా గంగాధర్ నాయక్, నలువల రాము, అమ్మ మధు, చరణ్, అలుగునూరి ప్రదీప్ కుమార్, భోధనపు నటరాజ్, సీనియర్ గాయకులు రచయితలు, కలకారులు ఎస్వి మల్లిక్ తేజ,గడ్డం రమేష్, ఒరుగంటి శేఖర్, అభి, పిఎల్ రెడ్డి, ఇస్లావత్ కమల్, మహిపాల్, సతీష్, సురేష్ నాయక్, మామిడి మోనిక, దీకొండ శిరీష, స్వరాజ్, సందీప్ రావు తదితరులున్నారు.

# శ్రీనివాస్ పేరులోనే ఆధ్యాత్మికత - సేవలోనే మానవత్వం

## కోరుట్లలో తెలంగాణ శ్రీనివాసుల సేవా సంఘం తృతీయ వార్షికోత్సవం



**జగిత్యాల అర్బన్ (ప్రభాత వార్త):** భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానం కలిగిన శ్రీనివాస్ అనే పేరు ఆధ్యాత్మికతకే కాకుండా సమాజ సేవకు నిదర్శనంగా నిలుస్తోందని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం కోరుట్లలోని జి.ఎస్. గార్డెన్స్‌లో తెలంగాణ శ్రీనివాసుల సేవా సంఘం తృతీయ వార్షికోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు జగిత్యాల, కరీంనగర్ జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో శ్రీనివాసులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ వుట్కూరి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సాంకేతికతను సేవతో జోడించి సుమారు 75 వాట్సాప్ గ్రూపుల ద్వారా 50 వేల మంది శ్రీనివాసులను ఒకే తాటిపైకి తెచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదానం చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా సుమారు 50 మంది రక్తదానం చేశారు. గత కొన్నేళ్లుగా తెలుగు కుటుంబాల్లో శ్రీనివాస్ పేరు పెట్టడం తగ్గుతోందని, భావితరాల్లో ఈ పేరు ప్రాశస్త్యాన్ని నిలబెట్టేందుకు తల్లిదండ్రులను ప్రోత్సహిస్తున్నామని ఆయన తెలిపారు. అంతేకాకుండా, సమాజంలో ఐక్యత, సేవా భావం పెంపొం దించేందుకు కరీంనగర్ నుండి తిరుమల వరకు పాదయాత్ర చేపట్టే ఆలోచన ఉన్నట్లు వెల్లడించారు. ఒకే పేరు కలిగిన వారంతా ఏకమై సమాజ సేవకు నడుం బిగించడం ఆదర్శనీయమని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పూజ్య గురువులు శ్రీ రామదాసి సురేష్ ఆత్మారాం మహారాజ్ పాల్గొని ఆశీస్సులు అందించారు. వీరితో పాటు వాసుదేవ హాస్పిటల్ డాక్టర్ శ్రీనివాస్, ఇజ్జగిరి శ్రీనివాస్, గంప శ్రీనివాస్, కోరుట్ల నుండి శ్రీరాముల శ్రీనివాస్, నీలి శ్రీనివాస్, జగిత్యాల నుండి రాజేష్ ని శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, కళ్యాణం శ్రీనివాస్, పాక శ్రీనివాస్, గాజుల శ్రీనివాస్, మర్రిపెల్లి శ్రీనివాస్, భోగ శ్రీనివాస్, చీకటి శ్రీనివాస్, చిట్ల శ్రీనివాస్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# షౌకత్ అలీ కుటుంబాన్ని పరామర్శించిన డా. రఘు

**కోరుట్ల అర్బన్, ప్రభాతవార్త :**



ప్రజాజ్యోతి రిపోర్టర్ సుజాయిత్ అలీ తండ్రి షౌకత్ అలీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, కోరుట్లలోని వారి నివాసానికి తెలంగాణ రక్షణ సేన కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. రఘు వెంట టీఆర్ఎస్ నాయకులు సుఖేందర్ గౌడ్, అజహర్ భాయ్ ఉన్నారు.

# కోరుట్ల వార్త

## మానవత్వాన్ని చాటుకున్న పద్మశాలి కులోన్నతి సంక్షేమ సంఘం

**కోరుట్ల, ప్రభాతవార్త :**



కోరుట్ల పట్టణంలోని కాలేజీ గ్రౌండ్‌లో అనాథగా మృతి చెందిన శ్రీరాముల లింబాద్రి మృతదేహానికి పద్మశాలి కులోన్నతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. లింబాద్రి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న జగిత్యాల జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ సంఘం నాయకులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే స్పందించిన పద్మశాలి కులోన్నతి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుంటుక ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బండ్ల రవికుమార్, 32వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ, ఆడెపు నరేష్ తదితరులు మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 32వ వార్డు కౌన్సిలర్ వసీం, మైనారిటీ సోదరులు అమీర్, సమీర్, గుడ్డేటి విజయ్, సంకోజి రవి, వీరభద్ర శ్రీనివాస్, లక్ష్మణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీనివాస మిత్రుల తృతీయ వార్షికోత్సవం

**కోరుట్ల, ప్రభాతవార్త :**



కోరుట్ల పట్టణంలోని జీఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో శ్రీనివాస మిత్రుల తృతీయ వార్షికోత్సవం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన తెలంగాణ సాంస్కృతిక, సంప్రదాయ నృత్య రూపకలు అలరించాయి. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్త సేకరణ లక్ష్యంగా పలువురు శ్రీనివాసులు రక్తదానం చేశారు. రక్తదాతలను నిర్వాహకులు సత్కరించి పురస్కారాలు అందజేశారు. ఈమేరకు శ్రీవేంకటేశ్వరస్వామి వేషాధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వందలాది శ్రీనివాసులతో ప్రాంగణం సందడిగా మారింది. ఈమేరకు శ్రీనివాసుల సేవా సంస్థ ద్వారా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఊట్కూరి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పేగు బంధం లేక పోయిన పేరు బంధంతో ఒక్కటైన శ్రీనివాసులంతా ఐకమత్యంతో ముందుకు సాగుతూ ప్రజోపయోగ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అంతకుముందు శ్రీనివాసులపై రచించిన పాటను నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస మిత్రులు పడిగెల శ్రీనివాస్, చెన్నమనేని శ్రీనివాసరావు, నీలి శ్రీనివాస్, బెజ్జారపు శ్రీనివాస్, బెజ్జంకి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## సిబిసిఐడి గుప్పిట్లో..

# రాష్ట్ర మిల్లర్ల చీకటి దందా...?

### 56మిల్లుల గుర్తింపు..

### 16మందిని అదుపులోకి తీసుకున్న సిఐడి అధికారులు..

### జమ్మికుంట, హుజురాబాద్ మిల్లర్ల గుండెల్లో.. పరిగెడుతున్న రైళ్లు..

**జమ్మికుంట/ హుజురాబాద్, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి రైతన్నలు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను దళారుల పాలు కాకుండా ఎంఎస్‌పి ధరలకు నేరుగా రైతుల నుండి కొనుగోలు చేసి, రైస్ మిల్లర్లకు సిఎంఆర్ కింద అంటగట్టడంతో.. కొండ నాలుకకు మందు వేస్తే.. ఉన్న నాలుక ఊడిపోయినట్లు.. ప్రభుత్వం నమ్ముకున్న రైస్ మిల్లర్లే.. దళారులుగా అవతారమెత్తి.. లక్షలాది క్వింటాళ్ళ, సన్న, దొడ్డు రకం వరిధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు అమ్ముకుని సంవత్సరాల తరబడి సర్కార్‌కు చుక్కలు చూపిస్తున్నారు. దీనిపై రాష్ట్ర సర్కార్ ఒక్కసారిగా కొరడ ఝులిపించడంతో రాష్ట్ర వ్యాప్తంగా సిబి సిఐడి అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అధికారులు జరిపిన తనిఖీలలో తీగలాగితే.. డొంక అంత కదిలి.. మిల్లర్ల చీకటి దందా బట్టబయలు అయింది. ఆదివారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాలలో రైస్ మిల్లర్లు గ్రేడ్ -ఏ సన్నరకం బియ్యానికి బదులుగా సంవత్సరాల తరబడి ఎఫ్‌సిఐ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, పౌరసరఫరాల శాఖ అధికారులతో కుమ్మక్కై సన్నరకానికి బదులు దొడ్డు బియ్యం సరఫరా చేయడంతో రాష్ట్ర ప్రభుత్వానికి పక్కా సమాచారం అందడంతో గత నెల రోజులుగా కరీంనగర్ జిల్లాతో పాటు ములుగు, నిజామాబాద్ ఇతర జిల్లాలలో పెద్ద ఎత్తున సోదాలు జరిపి, అనేక మంది మిల్లర్లు అక్రమాలకు పాల్పడినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ధృవీకరించడంతో అసలు బాగోతం బట్టబయలు అయింది. కరీంనగర్ జిల్లా హుజురాబాద్, జమ్మికుంట పట్టణాలకు చెందిన నలుగురు రైస్ మిల్లర్లను ఆదివారం తెల్లవారుజామున సిబిసిఐడి అధికారులు వారి ఇండ్ల నుండి అదుపులోకి తీసుకుని కరీంనగర్ జిల్లా కేంద్రానికి తరలించారు. ఇది ఇలా ఉండగా.. ములుగు, నిజామాబాద్ జిల్లాలలో ఏకకాలంలో మరో 11మంది మిల్లర్లను రాష్ట్ర సిబిసిఐడి అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రభాతవార్తకు అందిన పక్కా సమాచారం.జమ్మికుంట పట్టణంలోని అనేక మంది మిల్లర్లు చాలా సంవత్సరాలుగా వేలాది క్వింటాళ్ళ సన్నరకం గ్రేడ్ -ఏ వరిధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు అధిక ధరలకు అమ్ముకుని కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకున్నట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సిబిసిఐడి అధికారులు గుర్తించారు. గత వారం రోజుల క్రితం జమ్మికుంట పట్టణంలోని ఐదు మిల్లులలో, హుజురాబాద్ పట్టణంలోని రెండు మిల్లులలో రహస్యంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. సంబంధిత మిల్లులకు చెందిన ఏసికేలు, ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా గోదాంలలో భద్రపర్చిన చోట శాంపిల్స్ బియ్యం సేకరించి, అధికార యంత్రాంగం పరిశీలించగా, గ్రేడ్ - ఏ సన్నరకానికి బదులు, కామన్ దొడ్డు రకానికి చెందిన బి గ్రేడ్ దొడ్డు బియ్యాన్ని ఎఫ్‌సిఐ అధికారుల అండదండాలతో ప్రభుత్వానికి బియ్యం సరఫరా చేసినట్లు అధికారులు ధృవీకరించారు. ఈ దందాలో జమ్మికుంట పట్టణానికి చెందిన పలువురు పేరు మోసిన వ్యాపారులు గత 10 సంవత్సరాలుగా ఇదే దందా కొనసాగిస్తూ ప్రభుత్వానికి తూట్లు పొడుస్తు కోట్లాది రూపాయలు దోచుకున్నట్లు అధికారులు గుర్తించారు. జమ్మికుంట పట్టణానికి చెందిన ముగ్గురు వ్యాపారులు, హుజురాబాద్‌కు చెందిన మరో వ్యాపారి వీరి నలుగురిని కరీంనగర్ పట్టణంలోని సిబిసిఐడి కార్యాలయానికి తీసుకెళ్లినట్లు విశ్వాసనీయ సమాచారం..? ఇది ఇలా ఉండగా.. ఇదే రోజు తెల్లవారుజామున ములుగు, నిజామాబాద్ జిల్లాల నుండి ప్రభుత్వ నిబంధనలను తుంగల్లో తొక్కి మోసాలకు పాల్పడ్డ మరో 11మంది మిల్లర్లను ఆయా జిల్లాల సిబిసిఐడి అధికారులు అరెస్టు చేసినట్లు సమాచారం. కరీంనగర్ జిల్లాలో అక్రమాలకు పాల్పడుతున్న అనేక మంది రైస్ మిల్లర్లకు జమ్మికుంట పట్టణానికి చెందిన ఓ బడా రైస్ మిల్లర్ అండదండాగా నిలిచి ఈ అక్రమాలను ప్రోత్సాహిస్తూ కోట్లాది రూపాయల దందా నిర్వహిస్తున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. ఇదే మండలంలోని ఒక రైస్ మిల్లర్ 120 కోట్ల రూపాయలు వివిధ బ్యాంకులకు ప్రభుత్వ సిఎంఆర్ ధాన్యానికి చెల్లించ చవల్సి ఉండగా, ఆ మిల్లర్‌కు సంబంధించిన 80కోట్ల రూపాయల వరిధా న్యాన్ని జమ్మికుంటకు చెందిన బడా వ్యాపారి తక్కువ ధరకు కొనుగోలు చేసి బయటి రాష్ట్రాలకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నట్లు సిబిసిఐడి విచారణలో వెల్లడైనట్లు తెలుస్తుంది..?

### మిల్లర్ల గుండెల్లో పరిగెడుతున్న రైళ్లు..

గతంలో రైస్ మిల్లర్లు వ్యాపారం చేసుకోవడానికి వారి సొంత ఆస్తులను బ్యాంకులలో కుదువపెట్టి కోట్లాది రూపాయలు ఒకిసి ద్వారా అప్పులు తీసుకుని వ్యాపారం నడిపించేవారు. పాలకప్రభుత్వాల పుణ్యమా.. అని ప్రభుత్వాలే రైతుల నుండి నేరుగా ధాన్యం కొనుగోలు చేసి కస్టమ్ మిల్లింగ్ కింద మిల్లర్లకు ప్రతియేట ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఒక్కొక్క మిల్లుకు సరిపడ ధాన్యాన్ని సమకూరుస్తూ ఉంటే.. సంవత్సరాల తరబడి మిల్లర్లు అక్రమాలకు పాల్పడుతూ ప్రతియేటు కోట్లాది రూపాయల వరిధాన్యాన్ని అమ్ముకుని ఆ సొమ్ముతో కొందరు వ్యాపారులు మరికొన్ని కొత్త వ్యాపారాలు ఏర్పరుచుకుని కొనసాగిస్తుండగా... మరికొంత మంది రియలేస్టేట్ వ్యాపారంలో పెట్టిన సందర్భాలు ఉన్నాయి. మరికొందరు వ్యాపారులు సర్కార్ సిఎంఆర్ వరిధా న్యాన్ని అమ్ముకుని వారి పిల్లల కోసం ఎంబిబిఎస్, మెడికల్ సీట్లు కొనుగోలు చేసిన వారు లేకపోలేదు. ఒక్కొక్క వ్యాపారి ప్రభుత్వ వరిధాన్యం మూడు కోట్ల నుండి ఎనిమిది కోట్ల రూపాయల విలువ చేసే ధాన్యాన్ని అమ్ముకుని సంవత్సరాల తరబడి ప్రభుత్వానికి చెల్లించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలకు ప్రతి నెల అప్పు తీసుకున్న బ్యాంకులకు మిత్తి చెల్లిస్తుంది. ఈ తతాంగం ఏళ్ల తరబడి జరుగుతున్న పట్టించుకున్న పాలకులు లేరు.. పౌరసరఫరాల శాఖ అధికారుల అవినీతి వల్ల ఎఫ్‌సిఐ గిడ్డంగుల సంస్థ అధికార యంత్రాంగం చేతి వాటాలతోనే ఈ దందాలు జరుగుతున్నట్లు సిబిసిఐడి విచారణలో వెల్లడైనట్లు తెలుస్తుంది. ఆదివారం నలుగురు మిల్లర్లను సిబిసిఐడి అధికారులను అరెస్టు చేయడంతో కరీంనగర్ పాత జిల్లా వ్యాప్తంగా రైస్ మిల్లర్ల గుండెల్లో రైళ్ల పరిగెడుతున్నాయి.







## విద్యుత్ వేళల్లో స్పష్టత ఇవ్వండి

### కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త

వ్యవసాయానికి ఎన్ని గంటలు విద్యుత్ రైతులకు ఇవ్వనున్నా రో స్పష్టత ఇవ్వండి అని బి ఆర్ఎస్ నాయకులు మండల మాజీ జెడ్పిటిసి వంగల తిరుపతిరెడ్డి మాజీ ఎంపీపీ నూనెటి సంపత్ యాదవులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు ఆదివారం మండల కేంద్రంలో రెడ్డి ఫంక్షన్ హాల్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సాగునీరు ఇవ్వలేమని చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం వరి వద్దు మిగతా పంటలు వేయమని అంటున్నారు కానీ విద్యుత్ ఎన్ని గంటలు ఇవ్వనున్నామని స్పష్టత ఇస్తే రైతులు ఏ పంటలు వేసుకోవాలి వారు ఆలోచించుకుంటారన్నారు . మా ప్రభుత్వం పది సంవత్సరాలు ఉన్న ఏ ఒక్కరోజు గంట కరెంటు పోయినది లేదని గుంట కూడా ఎండిపోనివ్వకుండా చూసామని వారన్నారు రాష్ట్ర ప్రభుత్వం సాగునీరు ఇవ్వకుండా కనీసం తాగునీరు ఇవ్వడంలో కూడా విఫలమవుతుందన్నారు .

మా ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇస్తే రైతాంగానికి మేలు జరిగిందన్నారు కరెంటు ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుంద తెలియదని ప్రజలు వాపోతున్నారు అన్నారు .

తెలంగాణ మొదటి సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నుండి వృధా పోతున్న నీటిని ఎత్తిపోయించి పంటలు కాపాడితే అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వర ప్రాజెక్టు కుంగిపోయిందని తప్పుడు ప్రచారం చేస్తూ నీటిని ఆంధ్ర పాలకులకు అమ్ముకుంటున్నారన్నారు ఈ కార్యక్రమంలో వీరితోపాటు సర్పంచులు బూసి సదాశివరెడ్డి మంథని రాజయ్య నాగరాజు మాజీ మండల ఉపాధ్యక్షులు శిరీష దేవయ్య కొట్టు రవి ఆయా గ్రామాల మాజీ సర్పంచులు ఎంపిటిసిలు కార్యకర్తలు పాల్గొన్నారు





## హమాలీల సంక్షేమానికి కృషి చేస్తా

### మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

**పెద్దపల్లి, ప్రభాతవార్త:**

హమాలీ కార్మికుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎంబీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ దశాబ్ది ఆవిర్భావ దినోత్సవ సదస్సులో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి,ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కోదండరాంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హమాలీలు నిత్యం కష్టపడుతూ సరుకుల లోడింగ్, అన్‌లోడింగ్ పనుల ద్వారా ప్రజలకు, వ్యాపార రంగానికి కీలక సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. వారి శ్రమకు తగిన గుర్తింపు లభించేలా, కార్మికుల హక్కులు, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, హమాలీ సంఘం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి డబ్బులు ఇవ్వలేదని కొడుకు ఆత్మహత్య..

**మానకొండూర్,ప్రభాతవార్త:**



కన్నతండ్రిని కొడుకు అవసర నిమిత్తం డబ్బులు అడగగా తండ్రి నిరాకరించ దంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్న సంఘటన మాన కొండూరు మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల సతీష్ కుమారుడు ఎడ్ల రాకేష్(21) కారు డ్రైవర్ గా హైదరాబాదులో ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇటీవల పండగకు స్వగ్రామానికి ఇంటికి వచ్చిన రాకేష్ తన తండ్రి సతీష్ ను డబ్బులు అడిగాడు, దీంతో తండ్రి నిరాకరించడంతో రాకేష్ మనస్థాపానికి గురై, జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు మానకొండూరు సిఐ శ్రీలత తెలిపారు.

## కార్మికుల చెమటకు గౌరవం దక్కాలి

### డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య యాదవ్ పిలుపు

**గోదావరిఖని, ప్రభాతవార్త:** బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి కార్మికుల నుంచి నిత్యం బరువులు మోస్తూ కుటుంబాలను పోషించుకునే హమాలీల వరకు ప్రతి శ్రమజీవికి గౌరవం, భద్రత, న్యాయమైన ప్రతిఫలం అందాలని రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య యాదవ్ అన్నారు. కార్మికుల కష్టాలు గుర్తించి వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు, యాజమాన్యాలు చొరవ చూపాలని పిలుపునిచ్చారు.సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులు ఉత్పత్తి ప్రక్రియలో కీలకంగా పనిచేస్తున్నారని, వారి శ్రమకు తగిన గుర్తింపు, వేతనాలు, ఉద్యోగ భద్రత, వైద్య సదుపాయాలు అందాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసే కార్మికుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావుండకూడదన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ దశాబ్ది సభకు రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భశాస్త్ర శాఖల మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కోదండరామ్‌తో పాటు డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.



# మొగిలిపేటలో ఘనంగా పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు

**25 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం.. పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభం**

**మల్లాపూర్, ప్రభాతవార్త:**

మల్లాపూర్ మండలం మొగిలిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) 2001-2002 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యాభ్యాసం పూర్తి చేసుకుని 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా అప్పటి విద్యార్థులంతా ఒకచోట చేరి ఆత్మీయ సమ్మేళనాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి, భావితరాల విద్యార్థుల ప్రయోజనానికి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించడం వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాలకు పూర్వ విద్యార్థుల సేతమకు విద్యాబుద్ధులు నేర్పి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు పునాది వేసిన పాఠశాలకు తిరిగి ఏదైనా సేవ చేయాలనే సంకల్పంతో పూర్వ విద్యార్థులు గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు రిబ్బన్ కట్ చేసి గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, అతిథులు, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. గురువులకు ఘన సన్మానం25 ఏళ్ల తర్వాత




కలుసుకున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆత్మీయంగా గడిపారు. పాఠశాల రోజుల్లో తమ మధ్య ఉన్న స్నేహబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గురువుల మార్గదర్శకత్వం తమ జీవితాల్లో ఎంతో కీలక పాత్ర పోషించిందని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు రహిమాన్, బాపూరావు, సురేష్, పద్మాకర్ రావు, శ్రీనివాస్, మురళి, రాందాస్, వెంకటరమణారెడ్డి, స్వామి, నర్సా రెడ్డి, మల్లయ్యతో పాటు ఎస్ఎస్‌సీ 2001-2002 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి వార్త

## నాలుగు గ్రామాలను మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తీసుకురావాలి

**జనహితం అధ్యక్షుడు జేడి సుమన్**

**ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త**



:మెట్‌పల్లి మండల పరిధిలోని బండలింగాపూర్, మేడిపల్లి, సత్తక్కపల్లి, రాజేశ్వర్‌రావుపేట గ్రామాలను ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి నుంచి తొలగించి, మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తీసుకువచ్చేలా జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవాలని న్యాయవాది, జనహితం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు జేడి సుమన్ కోరారు. ఈ సందర్భంగా జేడి సుమన్ ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో ఇబ్రహీంపట్నం మండల పరిధిలో ఉన్న ఈ నాలుగు గ్రామాలను ప్రజల అభ్యర్థన మేరకు అప్పటి ప్రభుత్వం మెట్‌పల్లి మండలంలో విలీనం చేసిందని పేర్కొన్నారు. అప్పటి నుంచి రెవెన్యూ, ఇతర పరిపాలనా వ్యవహారాలు మెట్‌పల్లి మండలం పరిధిలో కొనసాగుతున్నప్పటికీ, పోలీస్‌స్టేషన్ పరిధి మాత్రం ఇబ్రహీంపట్నం కిందనే ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. పోలీసులకు సంబంధించిన ఫిర్యాదులు, వివాదాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఆయా గ్రామాల ప్రజలు మెట్‌పల్లి నుంచి ఇబ్రహీంపట్నం వరకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. దీనివల్ల ప్రయాణ సమయం, రవాణా ఖర్చులు పెరుగుతున్నాయని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, రైతులు, కూలీలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు.

## రామాలయ నిర్మాణానికి భూమి, ఆర్థిక సాయం

**మల్లాపూర్, ప్రభాతవార్త:**



మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో రామాలయ నిర్మాణానికి నల్ల రాంగోపాల్ రెడ్డి (రాంబాపు), ఆయన సోదరుడు నల్ల సతీష్ రెడ్డి ముందుకొచ్చారు. ఆలయానికి కేటాయించిన భూమిని న్యాయబద్ధంగా పత్రాల ద్వారా రాసిచ్చేందుకు ఆదివారం అంగీకరించారు. అలాగే ఆలయం లోపలి మార్బుల్స్, టైల్స్, కిటికీలు, తలుపులు, రంగుల పనులకు అయ్యే ఖర్చులను తానే భరిస్తానని రాంబాపు హామీ ఇచ్చారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులంతా ఐక్యంగా ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## అథ్లెటిక్స్‌లో ఇబ్రహీంపట్నం కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

**రెండు గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్ కైవసం**

**ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త:**





జగిత్యాల జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో ఇబ్రహీంపట్నం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినులు సత్తా చాటారు. ఆదివారం జగిత్యాల జిల్లా ఎస్.కే.ఎన్.ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ మీట్‌లో ముగ్గురు విద్యార్థినులు పతకాలు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ పోటీల్లో జె. హిమజ ట్రిపుల్ జంప్ విభాగంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించగా, ఎం. సాహిత్య జావెలిన్ త్రో విభాగంలో జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించి బంగారు పతకం దక్కించుకుంది. అదేవిధంగా టి. లయ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. పతకాలు సాధించిన ఈ ముగ్గురు విద్యార్థినులు ఎల్లుండి కరీంనగర్‌లో నిర్వహించనున్న జోనల్ స్థాయి పోటీల్లో జగిత్యాల జిల్లా తరపున పాల్గొననున్నట్లు ఇబ్రహీంపట్నం కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రజిత తెలిపారు. ఈ సందర్భంగా విజేత విద్యార్థినులతో పాటు వారికి శిక్షణ అందించిన పీఈటీ సరితను స్పెషల్ ఆఫీసర్ రజిత, ఉపాధ్యాయులు అభినందించారు. జోనల్ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు.

## అంబేద్కర్ అవార్డుకు యువకుడి ఎంపిక

**చిగురుమామిడి, ప్రభాత వార్త :**



బహుజన సాహిత్య అకాడమీ ఢిల్లీలో ప్రదానం చేసే అంబేద్కర్ జాతీయ అవార్డుకు చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బోయిని బాబును ఎంపిక చేసామని ఆ సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ బోయిని బాబు గత రెండు దశాబ్దాలుగా అటు బహుజన సమాజ్ పార్టీలో ఇటు దళిత సంఘాలలో పనిచేస్తూ అంబేద్కర్ సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాడని అన్నారు. దళిత, బహుజన ప్రజల అభివృద్ధి కోసం, విద్యార్థుల భవిష్యత్తు కోసం పలు కార్యక్రమాలు చేపట్టాడని కొనియాడారు. వారి సేవానిరతిని గుర్తించి ఈ అవార్డుకి ఎంపిక చేశామన్నారు. నవంబర్ 15న ఢిల్లీలో జరిగే 20వ జాతీయ సదస్సు సందర్భంగా బాబుకు ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు వారు తెలిపారు. తనకు అవార్డు రావడం, అవార్డు ఎంపికకు సహకరించిన సాహిత్య అకాడమీ రాష్ట్ర కమిటీ సభ్యులు ముక్కెర సంపత్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కి ఆత్మీయ సన్మానం



**చిగురుమామిడి, ప్రభాత వార్త**

:భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన చిగురుమామిడి గ్రామానికి చెందిన పొన్నం శ్రీనివాస్ ను ఆదివారం వారి నివాసం లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతం కోసం పొన్నం శ్రీనివాస్ మరింత బాధ్యతతో పనిచేస్తారని ఆకాంక్షి ంచారు. ఆయనకు జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో ప్రజలకు, పార్టీకి మరిన్ని సేవలు అందించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు జేరిపోతుల శ్రీకాంత్, రాజవీర్, బూత్ అధ్యక్షులు ముదిగిరి రాజు, చౌదరి ప్రశాంత్, కూతాటి పరశురాములు, మోడీకే భాను, మార్పక అవినాష్, అక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## వాల్గొండ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా బాలరాజ్

**మల్లాపూర్ ప్రభాతవార్త:**



మల్లాపూర్ మండలంలోని వాల్గొండ శ్రీ రామలింగేశ్వర గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా సిద్ధ బాలరాజును ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వచ్చే పుష్కరాలకు అలాగే గ్రామాభివృద్ధికి అన్ని విధాలుగా అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఉపాధ్యక్షులుగా సమ్మెట కిషన్, దేవలలాలు, ఉంగరాల సంతోష్, సలహాదారుడుగా కోశాధికారిగా ఇస్లావత్ శంకరును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను స్థానిక సర్పంచ్ తోపార వ శాంత్ కిరణ్ బాల్గొండ తండా సర్పంచ్ ధర్మ ధర్మసత్ సురేందర్ ప్రకటించారు.

## గంగారం కుటుంబానికి బీజేపీ నాయకుల ఆర్థిక సహాయం

**ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త:**



ఇటీవల మృతి చెందిన ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షుడు తరీ గంగారం కుటుంబానికి బీజేపీ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు రూ.పదివేల విలువైన చెక్కును బీజేపీ నాయకుడు రాపెల్లి సురేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గంగారం కుటుంబ సభ్యులకు నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ విషయాన్ని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ దృష్టికి తీసుకెళ్లి, పార్టీ తరఫున మరింత ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం తమ వంతుగా సహాయం అందిస్తున్నామని, త్వరలో పార్టీ నుంచి కూడా సహాయం అందేలా ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం ఐటీ సెల్ కన్వీనర్ పుప్పాల మహేందర్, ఓబీసీ మండల అధ్యక్షుడు మలుపు శ్రీను, గ్రామ సర్పంచ్ దరి రామానుజం, ఎండోమెంట్స్ ధార్మిక మండల కోకన్వీనర్ చిట్యాల నరేందర్, గుండాల సందీప్, ముద్దం నరసింహా, బూత్ అధ్యక్షులు పొన్నం గణేష్, రంజిత్, రాకేష్, అజయ్, భూమన్న రెడ్డి, దేవదాస్, రంజిత్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల వార్త



# రైతులకు నీరు,నాణ్యమైన విద్యుత్ అందించాలి

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త..

రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే అతిపెద్ద మండలాల్లో ఒకటైన తంగళ్లపల్లి మండలం ప్రస్తుతం ఇంచార్జ్ అధికారుల పాలనలో అతలాకుతలమవుతోంది. మండలానికి కీలకమైన తహసీల్దార్ మరియు ఎంపీడీవో పోస్టుల్లో పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో పరిపాలన పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. మండలానికి పూర్తిస్థాయి తహసీల్దార్ లేరు. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్ ఇంచార్జ్ తహసీల్దార్ గా వ్యవహరిస్తున్నారు. దీంతో రెవెన్యూ సమస్యలు, భూ వివాదాలు, భూ భారతి సమస్యలు పరిష్కారం కావడం లేదు. కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు రోజుల తరబడి మండల కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని, ఫైళ్లు పెండింగ్ లో ఉంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో ) కూడా ఇంచార్జే కావడంతో గ్రామ పంచాయతీల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఉపాధి హామీ పనులు, పల్లె ప్రగతి నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు సకాలంలో వినియోగం కావడం లేదు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ



నిలిచిపోయాయి. అధికారులకు, ప్రజలకు, ప్రజాప్రతినిధులకు మధ్య సమన్వయ లోపం ఏర్పడటంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు పూర్తిస్థాయిలో చేరడం లేదు. జిల్లా కేంద్రానికి అతి దగ్గరలో ఉన్న తంగళ్లపల్లి మండలంలోనే ఇలాంటి దుస్థితి నెలకొనడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తంగళ్లపల్లి మండలానికి పూర్తిస్థాయి తహసీల్దార్, ఎంపీడీవో ను నియమించి పాలనను గాడిలో పెట్టాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు..

## రైతును రాజును చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్. కవ్వంపల్లి .. మానకొండూర్ ఏఎంసీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారకారోత్సవం



మానకొండూర్, ప్రభాతవార్త :

రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి, నూతన పాలకవర్గం సభ్యులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తా నుండి గడి మహల్ నుండి తూర్పు దర్వాజా వైపుగా పల్లె మీది చౌరస్తా, మార్కెట్ యార్డ్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. మార్కెట్ యాడ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన చైర్మన్ రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రామిడి శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లతో డిఎంఓ షాబుద్దీన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వం అన్నారు. రైతులకు ఉచితంగా విద్యుత్తును అందించిన ఘనత కాంగ్రెస్ దే అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ. 2లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రైతులకు ఉచిత విద్యుత్ సబ్సిడీ విత్తనాలు పరికరాలు ఎరువులు , సకాలంలో అందించడం జరుగుతుందన్నారు. దళారుల వ్యవస్థ నుండి కాపాడేందుకు ప్రభుత్వం ఐకెపి, ప్యాక్స్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేసి 24 గంటల్లోనే రైతు ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. సన్న రకం వడ్లకు రూ. 500 రూపాయలను బోనస్ గా అందించడం జరుగుతుందన్నారు. సన్న వడ్లను మంచి ధరలకు మిల్లర్లు కొనుగోలు చేయడంతో రైతుకు లాభదాయకం జరుగుతుందన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని నూతన పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. రేవంత్ రెడ్డి పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో రైతుల కళ్ళల్లో ఆనందం కనిపిస్తుంది అన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పదవులు తప్పక వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ చైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య, తాసిల్దార్ విజయ్ కుమార్, మండల అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్లు నాగిశెట్టి రాజయ్య, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, రెంటాల లక్ష్మారెడ్డి, గంగుల రామ్ రెడ్డి, కీసర సంపత్, వెంకటరమణారెడ్డి , మాతంగి శిరీష అనిల్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెంచాల కిషన్ రావు, మార్కెట్ చైర్మన్ రేవల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రెమిడి శ్రీనివాస్ రెడ్డి, నందగిరి రవీంద్ర చారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్, సర్పంచులు బుర్ర శ్రీధర్ గౌడ్, బొట్ల స్వరూప కిషన్, నూతన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నీరు,నాణ్యమైన విద్యుత్ అందించాలి

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



తెలంగాణలో బీజేపీ అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు నిబద్ధతతో పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో అధ్యక్షుడు భూమల్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీ రాజరాజేశ్వర, శ్రీ అన్నపూర్ణ జలాశయాలు ఉన్నప్పటికీ రైతులకు నీటి విడుదలలో జాప్యం చేయడం, విద్యుత్ కోతలు విధించడం సరికాదన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి బీజేపీ పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తులు వితరణ



ముస్తాబాద్ ప్రభాత వార్త:

ప్రేరణ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు మేడిసురేష్ ఆధ్వర్యములో గూడెం గ్రామపంచాయతీ సిబ్బందికి గ్రామపాలక వర్గంచేతుల మీదుగా ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో గ్రామ సర్పంచ్ తాటిపెల్లి శంకర్, ఉపసర్పంచ్ దగ్గుభవిత, మాజీ ఎంపీటీసీ చిటినేనీ శ్రీనివాస్ రావు, వార్డు సభ్యులు శాడ శ్రీనివాస్, కస్తూరి అంజయ్య, ఏర్పుల ప్రవీణ్, దండు దేవయ్య, మెరుగు రవి తదితరులు పాల్గొన్నారు.

## శారదా విద్యా నిలయం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జగిత్యాల టౌన్, ప్రభాత వార్త..



జగిత్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శారదా విద్యా నిలయం 2000-2001 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాఠశాల నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారుఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించడంతో పాటు పునుగోటి నీరజాకుమారిని ప్రత్యేకంగా సన్మానించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పూర్వ విద్యార్థులు వివిధ దేశాలు, రాష్ట్రాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడటం గర్వకారణమని, అందరూ ఐకమత్యంతో ఉంటూ కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆటపాటలు, నృత్యాలతో సందడి చేస్తూ, ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటోలు దిగారు. పాత స్నేహాలను పునరుద్ధరించుకుంటూ, గురువుల పట్ల గౌరవాన్ని చాటుతూ ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## తంగళ్ళపల్లి ఫ్రెండ్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక.

.అధ్యక్షుడిగా ఎడమల శ్రీధర్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక..

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త..



తంగళ్ళపల్లి ఫ్రెండ్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులకు ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా ఎడమల శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా అంకారపు బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా లింగాల భూపతి, కోశాధికారిగా గొల్లపల్లి మల్లేశం గౌడ్, సహాయ కార్యదర్శిగా మచ్చ శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శిగా ఎర్ర శ్రీనివాస్ రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఎన్నికల అధికారులుగా మాదిరెడ్డి రవీందర్ రెడ్డి, చిట్యాల రత్నాకర్, తిరుణాహరి జీవన్ మూర్తి వ్యవహరించారు. అనంతరం జరిగిన సన్మాన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోర లక్ష్మీరాజం, ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వైద్య శివప్రసాద్, రిటైర్డ్ రెవెన్యూ అదనపు కార్యదర్శి తుమ్మ రామస్వామి, బస్సు వేణు నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎడమల శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన గౌరవ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుల, కార్యవర్గ సహకారంతో క్లబ్ ను మరింత ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం క్లబ్ గౌరవ సభ్యుడు కీర్తిశేషులు అంకారపు పెంటయ్య కు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్నేహం, సేవ, ఐక్యత అనే లక్ష్యాలతో ఫ్రెండ్స్ క్లబ్ ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేస్తుందని తెలిపారు.

# ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవ

**రోల వాగు ప్రాజెక్టుకు మహర్దశ**

**రైతుల చిరకాల స్వప్నం సాకారం దిశగా అడుగులు. .**

**మండల ముఖ్య నాయకులతో కలిసి**

**కలెక్టర్ తో ముఖాముఖి.**



**బీర్ పూర్ ప్రభాత వార్త.** జగిత్యాల నియోజకవర్గ ప్రజల సంక్షేమం, బీర్పూర్ మండల అభివృద్ధి ధ్యేయంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ నిరంతరం శ్రమిస్తున్నారు. ఇందులో భాగంగా మండల ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన రోల వాగు ప్రాజెక్టు సాధనలో మరో చారిత్రాత్మక ముందడుగు పడింది. ప్రాజెక్టుకు అవసరమైన 43 ఎకరాల భూ కేటాయింపు ప్రక్రియ పూర్తిగా ముగియడంతో, దశాబ్దాల నాటి రైతుల సాగునీటి కల సాకారమయ్యే దిశగా మార్గం సుగమమైంది. బీర్పూర్ మండల ప్రజలకు ప్రధాన వరప్రదాయిని అయిన రోల వాగు ప్రాజెక్టు భూ కేటాయింపు పూర్తి కావడంతో, భవిష్యత్తులో పూర్తిస్థాయిలో నీటిమట్టాన్ని స్టోరేజ్ చేసుకోవడానికి అద్భుతమైన అవకాశాలు ఏర్పడ్డాయి. దీనివల్ల స్థానిక రైతాంగానికి సాగునీటి ఎద్దడి పూర్తిగా తొలగిపోయి, వ్యవసాయ రంగం మరింత కళకళ లాడుతుందని పీఏసీఎస్ చైర్మన్ ముప్పాల రామచంద్రరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాజగోపాలరావు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూ కేటాయింపు ప్రక్రియ పూర్తయిన విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలోని మండల ముఖ్య నాయకుల బృందం జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్‌ను కలిసి ప్రత్యేకంగా వివరించింది. అనుమతులకు సంబంధించిన అన్ని అడ్డంకులు పూర్తిగా తొలగిపోయినట్లు కలెక్టర్‌కు తెలియజేస్తూ, ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు నాయకులు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పత్రాల అందజేత రోల వాగు ప్రాజెక్టు అనుమతులు మరియు భూ కేటా యింపునకు సంబంధించిన పూర్తి వివరాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లినట్లు నాయకులు వెల్లడించారు. ప్రాధాన్యతా ప్రాజెక్టుగా దీనిని మరింత వేగంగా ముందుకు తీసుకువెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. విద్యా రంగానికీ పెద్దపీట కేవలం సాగునీటి రంగమే కాకుండా విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చారు. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాల (కేజీబీవీ) విద్యార్థులు ఎదుర్కొంటున్న వసతి సమస్యను గుర్తించి, స్థానిక తాత్కాలిక భవనాలను పరిశీలించి వాటికి పూర్తిస్థాయి అనుమతులు మంజూరయ్యేలా చొరవ చూపారు. ప్రజల కోసం, రైతుల కోసం నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న రైతు నాయకుడు డాక్టర్ సంజయ్ కుమార్ అని, ఆయన కృషితోనే బీర్పూర్ మండలం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని నాయకులు ఈ సందర్భంగా కొనియాడారు.

# జగిత్యాల వార్త

## అంబేద్కర్ ఆశయాల స్మరణం

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త..



జగిత్యాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత ఇంటర్నేషనల్, డిక్కీ కోఆర్డినేటర్ నల్ల శ్యాం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట అంబేద్కర్ స్మరణ కార్యక్రమం ఆదివారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి గా డాక్టర్ వేణు గోపాల్, గౌరవ అతిథులుగా సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, మున్నా భాయ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ వేణు గోపాల్ మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆయన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టాలని యువతకు పిలుపునిచ్చారు. సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ మూడు సూక్తులను చదువుకోండి, పోరాడండి, సంఘటితమ్ కండి, ఇదే అంబేద్కర్ సందేశం అని వివరిస్తూ సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలోసీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, మున్నా భాయ్ , మాల మహానాడు ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్, దళిత సంఘాల సీనియర్ నాయకుడు దుమాల గంగాధర్, అనంతుల కాంతన్న, రుద్ర మనోహర్, సంకె మహేశ్, కండ్ల లక్ష్మణ్, అశోక్, గిద్దె శంకరయ్య, బొల్లం ప్రభాకర్, పాలోజి సత్యం, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మ్యాదరి శ్రీహరి, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉక్రెయిన్ నుంచి స్వగ్రామానికి జగిత్యాల కార్మికుడి మృతదేహం

**ఫలించిన ఎమ్మెల్యే, మంత్రి కృషి**



**జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:** ఉక్రెయిన్‌లో రష్యా జరిపిన క్షిపణి దాడిలో దుర్మరణం చెందిన జగిత్యాల జిల్లా హస్నాబాద్ గ్రామా నికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ మృత దేహం ఎట్టకేలకు స్వదేశానికి చేరుకోనుంది. కాంట్రాక్ట్ కార్మికుడిగా ఉక్రెయిన్ వెళ్లిన సుదర్శన్ సెప్టెంబర్ 1న జరిగిన దాడుల్లో మృతి చెందగా, ఈ ఘటనపై స్థానిక పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన నేపథ్యంలో మృతదేహం అప్పగింతకు దాదాపు రెండు నెలల సమయం పట్టింది. బాధితుడి భార్య భార్గవి ఇటీవల హైదరాబాద్‌లోని "సీఎం ప్రవాసీ ప్రజావాణి"లో విన్నవించుకోవడంతో తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించింది.జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్,మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ వ్యవహారంపై ప్రత్యేక చొరవ చూపి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించే ప్రక్రియ వేగవంతమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం ఉక్రెయిన్‌లోని భారత రాయబారి అంజనీ కుమార్‌తో సంప్రదింపులు జరిపి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఉక్రెయిన్ గగనతలంలో విమానాల రాకపోకలపై ఆంక్షలు అమల్లో ఉన్నందున మృతదేహాన్ని మొదట రోడ్డు మార్గంలో పోలాండ్‌కు తరలిస్తున్నారు. అక్కడి నుంచి "కేఎల్ఎమ్ రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్" విమానం ద్వారా నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డామ్ మీదుగా హైదరాబాద్‌కు రప్పించేందుకు ఏర్పాట్లు చేశారు.ఈ నెల 29న ప్రారంభమయ్యే ఈ ప్రయాణం అనంతరం అక్టోబర్ 31 తెల్లవారుజామున మృతదేహం హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనుంది. విమానాశ్రయం నుంచి మృతదేహాన్ని నేరుగా హస్నాబాద్‌కు తరలించి అంత్యక్రియలు నిర్వహించేందుకు అధికారులు,కుటుంబ సభ్యులు సిద్ధమవుతున్నారు.

## ఘనంగా పలిగిరి 25 వసంతాల పాటల పండుగ

జగిత్యాల టౌన్, ప్రభాత వార్త..



జానపద గాయకుడు, రచయిత, తెలంగాణ ఉద్యమ కారుడు పలిగిరి రాజేందర్ 25 వసంతాల పాటల ప్రస్థానం అత్యంతం రక్తి కట్టించింది. ఆదివారం స్థానిక దేవిశ్రీ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 25 సంవత్సరాలలో పలిగిరి రాజేందర్ అనుభవాలను కళాశ్రీ అధినేత గుండేటి రాజు, గానకోకిల అధినేతలు గొల్లపెల్లి శ్రీరాములు గౌడ్, ఎలిగేటి రాజేంద్రప్రసాద్ లు కొనియాడారు. దాదాపు ఉమ్మడి జిల్లాకు చెందిన 200 కళా కారులు పాల్గొని సాంస్క ృతిక కార్యక్రమాలతో అలరించారు. పలిగిరి రాజేందర్ ను కళా కారులందరు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తన ఉన్నతికి కారణమైన తల్లి దండ్రులను రాజేందర్ ఘనంగా సన్మానించాడు, యూ ట్యూబ్ ఫేం బోగే అశోక్ వాఖ్యానం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బుర్ర సతీష్ గౌడ్, ఒరుగంటి శేఖర్, గడ్డం రమేష్, అభి, పొద్దుపొడుపు శంకర్, దేవరశెట్టి జనార్దన్, పులి గోవర్ధన్, కొప్పుల వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సూర్య ధన్వంతరి ఆలయంలో ఘనంగా చతుర్దశి పూజలు

జగిత్యాల అర్బన్ ప్రభాత వార్త

ఆశ్వయుజ శుద్ధ చతుర్దశి, ఆదివారం పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో ఉషా ఛాయా సమేత శ్రీ సూర్య నారాయణ స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం సూర్యభగవానునికి ప్రీతిపాత్రమైన దినం కావడంతో స్వామివారికి శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం జరిపించారు. అనంతరం భక్తులందరూ కలిసి సామూహికంగా ఆదిత్య హృదయ స్తోత్ర పారాయణం చేశారు. విశేష అలంకరణ అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామివారి ప్రత్యేక పల్లకి సేవ కన్నులపండువగా సాగింది. ఈ సందర్భంగా భక్తులు తమ కోరికలు నెరవేరాలని సూర్యభగవానునికి భక్తితో ముడుపులు కట్టారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆరోగ్యప్రదాయిని అయిన ఖీఅమృత నిర్గుండిఖీ కషాయాన్ని ఉచితంగా వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొద్నాల శ్రీనివాస్, సహాయ కోశాధికారి గోపి, మేనేజింగ్ ట్రస్టీ గట్టు రాజేందర్, భారతాల రాజసాగర్, పెద్ది శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, కాడార్ల రాజేందర్, లక్ష్మీనారాయణ జ్యోతి దంపతులు, కావ్యశ్రీ, ఆలయ అర్చకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆడవాల జ్యోతి లక్ష్మణ్ నివాసంలో సత్యనారాయణ స్వామి పూజ

**హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్,**



**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:** జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడవాల జ్యోతి లక్ష్మణ్ నివాసంలో ఆదివారం నిర్వహించిన శ్రీ సత్య నారాయణ స్వామి పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్య క్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు గజెంగి నందయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రముఖులు శ్రీ సత్యనారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆడవాల జ్యోతి లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఆధ్యాత్మిక వాతావరణంలో కొంతసేపు గడిపారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# కరీంనగర్ వార్త

## అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

**నగరంలో 20 కి.మీ సైకిల్ ర్యాలీ – సీపీ గౌష్ ఆలం**

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త :**



కరీంనగర్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో నగరంలో 20 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సైకిల్ ర్యాలీలో కరీంనగర్ రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, డాక్టర్లు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఆదివారం ఉదయం పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ బస్ స్టేషన్, ప్రతిమ మల్టీప్లెక్స్, గీతాభవన్ చౌరస్తా, మంకమ్మతోటలోని పొన్నం కాంప్లెక్స్, శివ థియేటర్ సర్కిల్, కెమిస్ట్ భవన్ మీదుగా సాగింది. అనంతరం ఎలక్ట్రిసిటీ కార్యాలయం వద్ద యూ టర్న్ తీసుకుని, కోర్ట్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, నాఖా చౌరస్తా, బోట్ చౌరస్తా, కమాన్ చౌరస్తా, తిరిగి బస్టాండ్ సర్కిల్, ప్రతిమ మల్టీప్లెక్స్ మీదుగా ప్రయాణించి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద ముగిసిందని సీపీ తెలిపారు. కార్యక్రమ అనంతరం సీపీ ర్యాలీలో పాల్గొన్న సభ్యులకు అమరవీరుల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.అక్టోబర్ 31 వరకు వారోత్సవాలు:పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశ్యంతో అక్టోబర్ 31వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఏసిపిలు వెంకటస్వామి, విజయకుమార్ కమిషనరేట్ చెందిన ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు. వీరితో పాటు కరీంనగర్ కమిషనరేట్ రన్నర్స్ మరియు సైక్లిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్ పాసుల, డాక్టర్ కిరణ్, అడ్వకేట్ తిరుపతి లతో పాటు పాఠశాల విద్యార్థులు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## మహిళా తెలంగాణ ఉద్యమకారుల ముందస్తు అరెస్టులు బాధాకరం

**ఉద్యమకారుల హక్కులను కాలరాయొద్దు..**

**హామీలను వెంటనే అమలు చేయాలి**

**కరీంనగర్ రూరల్, అక్టోబర్ 25 (ప్రభాత వార్త):**



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసి, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మహిళా తెలంగాణ ఉద్యమకారులను కరీంనగర్ జిల్లా కేంద్రంలో ముందస్తుగా అరెస్టు చేయడంపై మహిళా ఉద్యమకారులు ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను ఆన్‌లైన్‌లో ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 26న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాస ముట్టడికి పిలుపునిచ్చినట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో పాల్గొనకుండా అడ్డుకునేందుకు ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని పేర్కొన్నారు.రాష్ట్ర సాధన కోసంపోరాడిన ఉద్యమకారులకు గుర్తింపు, గౌరవంకల్పించాల్సినప్రభుత్వంవారిసమస్యలను పరిష్కరించకుండా అరెస్టులకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరడంతప్పా?శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా ఉద్యమకారులకులేదా?అని నిలదీశారు.తెలంగాణ ఉద్యమంలో మహిళలు సైతం ధైర్యంగాపాల్గొని రాష్ట్రసాధన కోసంపోరాడారని గుర్తుచేశారు. ముందస్తు అరెస్టులతో తమ పోరాట స్ఫూర్తిని దెబ్బతీయలేరని, న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు . అక్టోబర్ 26న చేపట్టనున్న ముఖ్యమంత్రి నివాస ముట్టడి కార్యక్రమానికి ఆటంకాలు కల్పించకుండా, ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం ఆన్‌లైన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని కోరారు .ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మహిళా ఉద్యమకారుల ఆవేదనను అర్థం చేసుకోవాలని , ముందస్తు అరెస్టులతో వారి గొంతు నొక్కే ప్రయత్నాలను విరమించుకోవాలని మహిళా ఉద్యమకారులు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ట్రినిటీ ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

**కొత్తపల్లి,అక్టోబర్ 25(ప్రభాతవార్త)**



ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి జన్మదినోత్సవాన్ని అత్యంత ఆనందంగా, ఉత్సాహంగా, వైభవంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో యాజమాన్యం, బోధన, బోధనేతర సిబ్బంది, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలలోని ట్రినిటీ గ్రూప్ యొక్క అన్ని శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వేలాది మంది విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. విద్యార్థులు అధ్యాపకుల కరతాళధ్వనుల మధ్య చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి లాంఛనప్రాయంగా కేక్ కట్ చేయడంతో ఈ ఘనమైన వేడుకలు ప్రారంభమయ్యాయి. డైరెక్టర్లు, ప్రిన్సిపాల్‌లు సీనియర్ అధ్యాపక బృందం ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపి, గౌరవసూచకంగా సాంప్రదాయ శాలువలు మరియు జ్ఞాపికలను బహూకరించారు.ఈ కార్యక్రమంలో ప్రసంగించిన వక్తలు, శ్రీ ప్రశాంత్ రెడ్డి దూరదృష్టి గల నాయకత్వాన్ని, విద్యా రంగంలో శ్రేష్ఠత పట్ల ఆయనకున్న అచంచలమైన నిబద్ధతను, మరియు ఉత్తర తెలంగాణలో ట్రినిటీ గ్రూప్‌ను ఒక ప్రముఖ విద్యా సంస్థగా తీర్చిదిద్దడంలో ఆయన చేసిన అవిశ్రాంత కృషిని ప్రశంసించారు.సిబ్బందికి, విద్యార్థులకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ, తన పట్ల చూపిన అపారమైన అభిమానానికి శ్రీ దాసరి ప్రశాంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు:ఈ కార్యక్రమానికి క్యాంపస్ ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు పరిపాలనా సిబ్బంది, విద్యార్థులు స్థానిక ప్రముఖులు హాజరయ్యారు.

## యూనిక్ కంపెనీ పెట్టుబడుల మోసం కేసులో ఐదుగురు నిందితుల పట్టివేత

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త**



:కరీంనగర్॥ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నం. 212/2026 కేసులో యూనిక్ మెర్కంటైల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, స్వయం మల్టీస్టేట్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సంస్థలకు సంబంధించిన పెట్టుబడుల మోసం ఆరోపణలపై సీసీస్ –కరీంనగర్ పోలీసులు ఐదుగురు నిందితులను పట్టుకున్నారు. ప్రాథమిక విచారణలో ప్రధాన నిందితుడు రాజ్ కుమార్ కైలాష్ రాయ్ వివిధ పెట్టుబడి పథకాలను ప్రవేశపెట్టి ప్రజల నుంచి పెట్టుబడులు సేకరించినట్లు వెల్లడైంది. నెలవారీ పెట్టుబడి పథకాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రియల్ ఎస్టేట్ పథకాలు, హోటల్ వెకేషన్ ప్యాకేజీల పేరుతో ప్రజలను ఆకర్షించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పట్టుబడిన నిందితులు ఏజెంట్లు, ప్రాంతీయ ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరిస్తూ కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజల నుంచి పెట్టుబడులు సేకరించినట్లు విచారణలో వెల్లడైంది. పెట్టుబడులపై ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తామని నమ్మించి, బాండ్ పత్రాలు అందజేసినట్లు తెలిసింది. 2019లో పలు పథకాల గడువు ముగిసినప్పటికీ పెట్టుబడిదారులకు సొమ్ము తిరిగి చెల్లించలేదని, కోవిడ్ కారణంగా నష్టాలు వచ్చాయని పేర్కొంటూ 2020లో కంపెనీ కార్యకలాపాలను నిలిపివేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇట్టి మోసంలో కరీంనగర్ జిల్లాలో భాదితులకు దాదాపు 26 నుండి 28 కోట్ల వరకు మోసం చేసినట్లు దర్యాప్తులో తెలుయుచున్నది. ఇట్టి కేసు లో ప్రధాన నిందితుడు అయిన రాజ్ కుమార్ కైలాష్ రాయ్ ను అదిలాబాద్ పోలీస్ వారు అరెస్ట్ చేయగా ప్రసుతం అదిలాబాద్ జైల్ లో ఉన్నాడు. ఇట్టి కేసు లో ఇంకా ఎవరైనా భాదితులు ఉన్నచో సంభందిత పోలీస్ స్టేషన్ లో అయిన లేకా సిసి ఎస్ కరీంనగర్ కి వచ్చి పిర్యాదు చేయాలన్నరు పట్టుబడిన నిందితుల వివరాలు:గుడిపాటి గాంధీ, హైదరాబాద్.మాకలసోంపల్లి కరియప్ప, హైదరాబాద్.ఉల్లిగడ్డల సంగప్ప, హైదరాబాద్.కొమిరె భూమా గౌడ్, నిజామాబాద్.యేదెల్ల రమేష్, పెద్దపల్లి జిల్లా.ఈ కేసులో మోసానికి గురైన ఇతర బాధితుల సంఖ్య, సేకరించిన మొత్తం, నిధుల లావాదేవీలు ఇతరుల ప్రమేయంపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

## కరీంనగర్ కన్స్యూమర్ ఫీల్డ్ ఫోర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అక్కు శ్రీనివాస్ విజయం



**కరీంనగర్, ప్రభాతవార్త**

:కరీంనగర్ కన్స్యూమర్ ఫీల్డ్ ఫోర్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో అక్కు శ్రీనివాస్ విజయం సాధించారు. అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు పోటీ పడగా, చివరి వరకు ఉత్కంఠ నెలకొంది. ఓట్ల లెక్కింపు అనంతరం అక్కు శ్రీనివాస్ విజేతగా నిలిచారు.ఎన్నికల్లో మొత్తం 230 ఓట్లు పోలయ్యాయి. వీటిలో అక్కు శ్రీనివాస్‌కు 118 ఓట్లు రాగా, చిదురాల రామ్ మోహన్‌కు 104 ఓట్లు, రియాజ్‌కు 8 ఓట్లు వచ్చాయి. దీంతో అక్కు శ్రీనివాస్ తన సమీప ప్రత్యర్థి చిదురాల రామ్ మోహన్‌పై 14 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు.విజయం అనంతరం అక్కు శ్రీనివాస్ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తాననే ఆకాంక్షను వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పిట్టల మధు, మీడియా కన్వీనర్ చిట్టిమల్ల మహేందర్, సమన్వయకర్త తాటిపల్లి గణేష్, మాజీ అధ్యక్షుడు అరుకుల నాగరాజు, మాజీ కార్యదర్శి మేదిచెలిమి శేఖర్, సలహాదారుడు దూలం మల్లిక్, న్యాయ సలహాదారు కాదర్ల శ్రీనివాస్, ఎన్నికల కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌తో పాటు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## టిస్‌ఎట్2026 స్కాలర్‌షిప్ పరీక్షకు 1,138 మంది విద్యార్థుల హాజరు

**ట్రినిటీ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహణ.. ప్రతిభ ఆధారంగా**

**100 శాతం వరకు స్కాలర్‌షిప్‌లు**

**కరీంనగర్ రూరల్, అక్టోబర్ 25 (ప్రభాత వార్త):**



ట్రినిటీ విద్యా సంస్థల ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టిస్‌ఎట్2026 (ట్రినిటీ స్కాలర్‌షిప్ ఆప్టిట్యూడ్ టెస్ట్) పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. ఈ పరీక్షకు కరీంనగర్ మరియు పరిసర ప్రాంతాలకు చెందిన మొత్తం 1,138 మంది విద్యార్థులు హాజరయ్యారు.ట్రినిటీ జూనియర్ కళాశాలల ఐఐటీ, నీట్, ఈఏపీసెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షను 2027-28 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వారి మార్కుల ఆధారంగా 100 శాతం వరకు స్కాలర్‌షిప్‌లు అందించే అవకాశం ఉందని పేర్కొన్నారు.విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించడంతో పాటు, భవిష్యత్తులో ఐఐటీ, నీట్, ఈఏపీసెట్ వంటి ప్రవేశ పరీక్షలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడమే ఈ పరీక్ష ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి ఉన్నత విద్యకు ప్రోత్సాహం కల్పించేందుకు ఇటువంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులు తమ విద్యా లక్ష్యాలను సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవడానికి స్కాలర్‌షిప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని ట్రినిటీ విద్యా సంస్థల ప్రతినిధులు వెల్లడించారు.

# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి..

## నీరు,విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్



**సుల్తానాబాద్, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ సూచించారు. ఆదివారం సుల్తానాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల ఎదురయ్యే పరిస్థితులు, వాటిని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. తెలంగాణతో పాటు ప్రపంచవ్యాప్తంగా 81కు పైగా దేశాలు ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వరి పంటకు బదులుగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. దీనివల్ల నీటి వినియోగాన్ని తగ్గించుకోవడంతోపాటు అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

### నీరు, విద్యుత్ పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత

ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడితే విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉందని అన్నయ్య గౌడ్ పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ అవసరమైన మేరకే విద్యుత్‌ను వినియోగిస్తూ పొదుపు పాటించాలని కోరారు. నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచిం చారు. నీరు, విద్యుత్ వంటి సహజ వనరులను సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని సమిష్టిగా ఎదుర్కొ నేందుకు ప్రజలంతా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పిలుపునిచ్చారు. వనరుల పొదుపునకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

# పూసల సంఘం అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేయాలి

## పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు.. పూసల సంఘం పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**పెద్దపల్లి, ప్రభాతవార్త:** పూసల సంఘం నూతన కార్యవర్గం సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి ఐక్యంగా కృషి చేయాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పూసల సంఘం పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పొదిల కుమారస్వామి, సమన్వయ కమిటీ చైర్మన్ గుంటుపల్లి సమ్మయ్య, ఉపాధ్యక్షుడు పట్టేం నరసయ్య, గౌరవ అధ్యక్షుడు ముద్ర కోల తిరుపతి, ప్రధాన కార్యదర్శి గుంటుపల్లి ప్రశాంత్, కోశాధికారి పసులోటి జగన్, వర్కింగ్ ప్రెసిడెంట్ చేనికేశవులు, పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు నాగిశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కోనేటి శ్రీనివాస్, గుడ్ల సతీష్, కోనేటి కుమార్, గుడ్ల శ్రీనివాస్, గుడ్ల రామ్మూర్తి పలువురు ప్రమాణ స్వీకారం చేశారు. సంఘం బలోపేతానికి, పూసల సామాజిక వర్గం అభ్యున్నతికి నాయకులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. సమాజంలో ఐక్యతను పెంపొందిస్తూ యువతకు, మహిళలకు అవకాశాలు కల్పించే దిశగా సంఘం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కోనేటి శ్రీనివాస్, పూసల సంఘం ప్రజాప్రతినిధులు, సభ్యులు, కౌన్సిలర్లు, సింగిల్ విండో చైర్మన్, కాంగ్రెస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# 79 మార్కులతో సుల్తానాబాద్ ప్యాక్స్‌కు అగ్రస్థానం...

## ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యుత్తమ పనితీరు

**సుల్తానాబాద్, ప్రభాతవార్త:** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పనితీరు మూల్యాంకనంలో సుల్తానాబాద్ ప్యాక్స్ 79 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలోని ప్యాక్స్‌ల పనితీరును పరిశీలించగా ఈ గుర్తింపు లభించినట్లు సంఘ పాలకవర్గం తెలిపింది. రైతులకు సకాలంలో రుణాల పంపిణీ, ఎరువులు, విత్తనాల సరఫరా, ధాన్యం సేకరణలో పారదర్శకత, రుణాల వసూళ్లలో పురోగతి వంటి అంశాల్లో సంఘం మెరుగైన పనితీరు కనబరిచింది. వ్యాపార వైవిధ్యీకరణ, డిజిటలైజేషన్, నిర్వహణ ప్రమాణాల అమలులోనూ ప్రతిభ చూపింది. ఈ సందర్భంగా ప్యాక్స్ పీఏసీ చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ మాట్లాడు తూ.. 79 మార్కులతో ప్రథమ స్థానం సాధించడం గర్వకారణమన్నారు. రైతుల నమ్మకం, పాలకవర్గ సభ్యుల సహకారం, సిబ్బంది నిరంతర కృషి తోనే ఈ గుర్తింపు సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ రైతులకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సుల్తానాబాద్ ప్యాక్స్‌కు గుర్తింపు లభించడంపై సంఘ సభ్యులు, స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు. సంఘ అభివృద్ధికి సహకరించిన అధికారులు, సిబ్బంది, రైతులకు పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపింది.

# ప్రమాద భాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే...

**అంతర్గాం, ప్రభాత వార్త :** రామగుండం పట్టణం లోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన యువకులు బట్టారీ అరవింద్, మచ్చ సాయి కుమార్ లు హుజురాబాద్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆదివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ భాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతు లు అరవింద్, సాయి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఓదార్చి ఎమ్మెల్యే తన ప్రగాఢ సంతాపం ను వ్యక్తం చేశారు.భాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమం లో ఎమ్మెల్యే వెంట రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండీ ముస్తఫా,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దీటి బాలరాజు, రామగుండం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి హరి ప్రసాద్, కార్పొరేటర్లు ఇసంపల్లి అంజులు, దారంగుల కుమార్,కాంగ్రెస్ నాయకులు సురేష్, ఎండీ తాజోద్దీన్, రఫీక్ తదితరులు ఉన్నారు.



# ఘనంగా దాసరి ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

**జూలపల్లి,ప్రభాతవార్త:** జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, గ్రామస్థుల ఆధ్వర్యంలో మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి తనయుడు ట్రినిటీ విద్య సంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సంకెండ్ల లక్ష్మీ నర్సయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు,కార్యకర్తలు,గ్రామస్థులు దాసరి ప్రశాంత రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఆయన ఆయురారోగ్యాలతో,నిండు నూరేళ్ల ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తొగరు శ్రీనివాస్,మాజీ సింగిల్ విండో డైరెక్టర్ ఉయ్యాల వెంకటేష్ గౌడ్, గుండు మొగిలి,వార్డు సభ్యులు కల్లేపల్లి స్వామి,మద్దెల నరేష్,గుర్రం చంద్రయ్య, గడ్డమిడి శ్రీనివాస్,బెదిగం లక్ష్మీ నర్సయ్య, దాడి నాగరాజు, తొగరు నరేష్,దాడి నరేష్,బత్తిని జంపయ్య,పెద్దపల్లి సందీప్,బొజ్జ అంజయ్య, బొజ్జ పెద్దులు,సుద్దాల రవి,చొప్పరి మహేష్, కొండపల్లి నవీన్, కల్లేపల్లి ప్రభాకర్,బొజ్జ మల్లయ్య,సందనవేణి రాజయ్య పాల్గొన్నారు.



# పెద్దపల్లి వార్త






# దాసరి ప్రశాంత్ రెడ్డిపై అభిమానాన్ని చాటిన కొమ్మ సతీష్ యాదవ్

## గోదావరి ఒడ్డున ప్రశాంత్ రెడ్డి చిత్రంతో సైకత శిల్పం

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** ట్రినిటీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్, బీ ఆర్ ఎస్ పార్టీ యువజన నాయకుడు దాసరి ప్రశాంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బి ఆర్ ఎస్ యువజన నాయకుడు కొమ్మ సతీష్ యాదవ్ ప్రత్యేక రీతిలో శుభాకాంక్షలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి గోదావరి తీరంలో ప్రశాంత్ రెడ్డి చిత్రపటాన్ని ప్రతిబింబించేలా అద్భుతమైన సైకత శిల్పాన్ని తీర్చిదిద్ది తన అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఈ కళారూపం పలువురి దృష్టిని ఆకర్షించింది. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ విద్యారంగంలో అనేకమంది విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తూ, యువతకు స్ఫూర్తినిస్తున్న ప్రశాంత్ రెడ్డికి మనస్ఫూర్తిగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటూ మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని కోరుకున్నారు. జీవితంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవడంతో పాటు ప్రజాసేవలో అంచెలంచెలుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

# పంక్షన్ హాల్ నిర్మాణానికి రూ.10లక్షల నిధులు కేటాయించండి

## పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు కొంకటి లింగ మర్తి వినతి

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** పంక్షన్ హాల్ నిర్మాణానికి రూ.10లక్షల నిధులు కేటాయించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు జిల్లా ఎస్సీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు కొంకటి లింగ మర్తి ఆదివారం వినతి అందజేశారు. పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు సుమారు 1000 నుంచి 2వేల మంది ఉన్నారని తెలిపారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ తాత అయిన మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ గడ్డం వెంకటస్వామి (కాకా) గతంలో చిన్న కమ్యూనిటీ భవనాన్ని ఇచ్చారని, ఇప్పుడు దాదాపు రెండు ఎకరాల వరకు భూమి ఇండ్ల మధ్యలో ఉందని, అక్కడ పంక్షన్ హాల్ కట్టుకోవడానికి రూ.10లక్షల నిధులు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# ప్రతి పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

## అందరికీ ఉచిత విద్య ప్రజా ప్రభుత్వం లక్ష్యం

## రూ.200 కోట్లతో జగిత్యాల జిల్లా తాటిపల్లి లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం

## 25 ఎకరాల్లో 2,500 మంది విద్యార్థులకు ఆధునిక వసతులతో విద్య

## వచ్చే విద్యా సంవత్సరం నాటికి కనీసం 10 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో తరగతుల ప్రారంభానికి చర్యలు

## గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పుస్తకాలు, యూనిఫాంలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు

## విద్య, సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం సమ ప్రాధాన్యం

## రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ

### మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్..





జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు మంత్రుల శంకుస్థాపజగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించి, వారి జీవితాల్లో సమూల మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఆదివారం జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో ప్రభుత్వం నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ లతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తన రాజకీయ ప్రస్థానం విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైందని తెలిపారు. పేద ప్రజలకు అందించగలిగే అత్యంత విలువైన సంపద విద్యేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన కులగణనలోనూ విద్య ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడుతున్న విషయం స్పష్టమైందని తెలిపారు.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ విద్య ద్వారా ఉన్నత స్థాయికి ఎదిగారని, గురుకుల విద్యాసంస్థల్లో చదువుకున్న ఎంతోమంది నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, రాష్ట్రంలోని 326 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో కేవలం 26 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని తెలిపారు.ప్రస్తుత ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఒకే ప్రాంగణంలో నాలుగు గురుకుల విద్యాసంస్థలకు అవసరమైన భవనాలను నిర్మించేలా చర్యలు చేపట్టిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులందరూ ఒకే చోట విద్యనభ్యసించేలా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు.వచ్చే విద్యా సంవత్సరం నాటికి కనీసం 10 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో తరగతులు ప్రారంభించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భోజనం, పుస్తకాలు, యూనిఫాంలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.గురుకుల విద్యార్థుల డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు పేర్కొన్నారు. గురుకులాలకు సంబంధించిన బిల్లులను గ్రీన్ ఛానల్ ద్వారా క్రమం తప్పకుండా చెల్లించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యంప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పెట్టుబడి సాయం పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.25 లక్షల మంది రైతులకు రూ.20 వేల కోట్ల మేర రుణమాఫీ చేశామని, రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచామని తెలిపారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా 75 వేల ఉద్యోగాల నియామకాలు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.సూపర్ ఎల్‌నినోను రాజకీయాలకు అతీతంగా ఎదుర్కోవాలి పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ్డాయని, రాష్ట్రంలో కరువును ఎదుర్కొనేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రకృతి పరిస్థితులను రాజకీయాలకు ముడిపెట్టి విమర్శలు చేయడం సరికాదన్నారు.గతంలో కొండగట్టు బస్సు ప్రమాదం, కరోనా వంటి సంక్షోభాలు ఎదురైనప్పుడు తాము అప్పటి ప్రభుత్వాన్ని నిందించలేదని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ప్రతి గ్రామంలో నీటి నిల్వలను పెంచేందుకు కుంటలు, వ్యవసాయ భూముల వద్ద పంట కుంటల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటూ భూగర్భ జలాల పెంపునకు కృషి చేస్తున్నట్లు వివరించారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో విద్యారంగానికి భారీ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముందుకు సాగుతున్నారని తెలిపారు. జగిత్యాలలో ఇటీవల కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. తాటిపల్లిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను 18 నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో గురుకులాలకు సొంత భవనాలు, నాణ్యమైన ఆహారం వంటి సదుపాయాల కల్పనకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని పేర్కొంటూ, ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మెరుగైన వసతులు కల్పిస్తోందన్నారు. డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీల పెంపుతో పాటు నాణ్యమైన భోజనం, పుస్తకాలు, యూనిఫాంలు అందిస్తున్నట్లు తెలిపారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితుల నేపథ్యంలో నీటి సంరక్షణకు అందరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలాలు పడిపోవడం వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి సూచనల మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సూపర్ ఎల్‌నినోను రాజకీయాలకు అతీతంగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.ధర్మపురి బస్ డిపోను కోరిన వెంటనే మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దల ద్వారా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. తాటిపల్లిలో 25 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 2,600 మంది విద్యార్థులకు ఉపయోగపడేలా ఏడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకువస్తూ ముఖ్యమంత్రి స్వయంగా విద్యారంగ అభివృద్ధిపై పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు.గురుకుల విద్యార్థులకు డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంచడంతో పాటు నాణ్యమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు నైపుణ్య శిక్షణ అందించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.గత ప్రభుత్వం రాష్ట్రంపై సుమారు రూ.8.12 లక్షల కోట్ల అప్పుల భారం మోపిందని, ప్రస్తుతం వడ్డీ చెల్లింపుల భారం అధికంగా ఉందని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ కొత్త రేషన్ కార్డుల మంజూరు, రైతులకు రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.ముఖ్యమంత్రి, మంత్రుల సహకారంతో జగిత్యాల జిల్లాలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. విద్య, సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా సాగినప్పుడే సమాజంలో సమగ్ర పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, తాటిపల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 2,600 మంది విద్యార్థులకు విద్యనందించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.నిర్మాణ పనులను 18 నెలల్లో పూర్తి చేసేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో విద్యారంగ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో రూ.10 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టగా, జిల్లాలో మొత్తం రూ.40 కోట్లతో పాఠశాలల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రూ.50 కోట్ల వ్యయంతో కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, కోరుట్లలో రూ.45 కోట్ల వ్యయంతో జవహర్ నవోదయ విద్యాలయ నిర్మాణ పనులు కూడా ప్రారంభమైనట్లు వివరించారు. ధర్మపురిలో యంగ్ ఇండియా కార్యక్రమం కింద పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.గత రెండేళ్లలో జగిత్యాల జిల్లాలో విద్యారంగ మౌలిక సదుపాయాల కల్పనకు సుమారు రూ.500 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నిర్మాణాలు పూర్తయితే జిల్లాలో విద్యారంగానికి మరింత బలం చేకూరుతుందని, అన్ని విద్యా సంస్థల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, జగిత్యాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.విద్య ద్వారానే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని, తెలంగాణ రైజింగ్ విధానం ద్వారా విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 2,600 మంది విద్యార్థులు ఒకే ప్రాంగణంలో ఆధునిక తరగతి గదులు, క్రీడా మైదానాలు, గ్రంథాలయం తదితర సదుపాయాలతో విద్యనభ్యసించే అవకాశం కలుగుతుందని వివరించారు. బీసీ గురుకుల జూనియర్ కళాశాలను సందర్శించినప్పుడు డైట్ ఛార్జీల పెంపుతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతున్నట్లు గమనించానని తెలిపారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసన్నాంబ, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు,నారాయణ రెడ్డి , సర్పంచులు, ఉప సర్పంచులు, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి గ్లోరికి వికాస్ భరోసా.. వైద్య విద్యకు రూ.45 వేల సాయం

నీట్‌లో 36 వేల ర్యాంకు సాధించిన గ్లోరికి ప్రతిమ ఫౌండేషన్ చేయూత

వేములవాడ రూరల్ ప్రభాతవార్త



వేములవాడ అర్బన్ మండలం హనుమాజీపేటకు చెందిన పూదూరి గ్లోరి పేదరికాన్ని అధిగమించి నీట్ పరీక్షల్లో 36 వేల ర్యాంకు సాధించి, ఖమ్మంలోని మమత డెంటల్ కాలేజీలో దంత వైద్య విద్యకు సీటు సంపాదించింది. ఆమె ఉన్నత విద్యకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చెన్నమనేని వికాస్ ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.45 వేల ఆర్థిక సాయం అందించారు. గ్లోరి తండ్రి శంకర్ కూలి పని చేస్తూ తన కుమార్తెను చదివిస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా గ్లోరి పట్టుదలతో చదివి నీట్‌లో అర్హత సాధించింది. దంత వైద్య విద్యకు అవసరమైన ప్రవేశ రుసుములు, పుస్తకాలు, వసతి తదితర ఖర్చులు కుటుంబానికి భారంగా మారడంతో ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ వికాస్ స్పందించి ఆర్థిక చేయూత అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వికాస్ మాట్లాడుతూ.. పేదరికం కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదని అన్నారు. గ్లోరి మరింత కష్టపడి చదివి దంత వైద్యురాలిగా ఎదిగి పేదలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆర్థిక సాయం అందించిన డాక్టర్ వికాస్‌కు గ్లోరి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయం తన విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగపడుతుందని, భవిష్యత్తులో దంత వైద్యురాలిగా స్థిరపడి సమాజానికి సేవ చేస్తానని గ్లోరి పేర్కొంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మధు, వేములవాడ రూరల్ మండల అధ్యక్షుడు పరమేష్, చందుర్తి మండల అధ్యక్షుడు ముఖిలే విజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, బొల్లారం సర్పంచ్ సౌజన్య మల్లికార్జున్, వేములవాడ కౌన్సిలర్లు శ్రీనివాస్, శ్రీకాంత్, ముత్యం బాబు, లక్ష్మీ మరాజ్యం, జిల్లా కౌన్సిల్ సభ్యుడు జక్కుల తిరుపతి, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి మల్లారం తిరుపతి, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి కళ్లెట్ల నరేష్, మండల ఉపాధ్యక్షుడు పల్లికొండ నారాయణ, మండల కార్యదర్శి మందా రాజేందర్, బూత్ అధ్యక్షులు ఆదేపు విజయ్, పంచెర్పుల మహేష్, బుర్ర ప్రదీప్, చింతకుంట గౌతమ్, తూమ్ రమేష్, సార నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి ప్రజా ప్రభుత్వం భరోసా

సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీతో ఆర్థిక అండ: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

.వేములవాడ ప్రభాతవార్త:





ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాల ద్వారా అర్హులకు వైద్య సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో మాతృశ్రీ, అశ్విని, వర్ష ఆసుపత్రుల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల్లో తీవ్రమైన అనారోగ్యం, శస్త్రచికిత్స అవసరమైనప్పుడు ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం సహాయం అందిస్తోందన్నారు. చెవులు వినిపించని ఆరేళ్ల బాలుడికి ఆపరేషన్ కోసం 5 లక్షల సహాయం అందేలా చర్యలు తీసుకున్నామని, చికిత్స అనంతరం బాలుడు మాట్లాడుతుండటంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తోందని తెలిపారు. నిమ్స్, గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, ఎంజీఎం వంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, ప్రజలు భయపడకుండా ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు. పేదలకు వైద్య సేవలు అందించడంలో ప్రైవేట్ ఆసుపత్రులు కూడా సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు, వైద్యులు చీకోటి సంతోష్ కుమార్, సత్యనారాయణ స్వామి, సాయికుమార్, పరమేశ్వర్, ప్రవీణ్ వర్మ, హారిక, అనిల్, శ్రీదేవి, మున్సిపల్ అధికారులు, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 80 అడుగుల రహదారి పనుల్లో నాణ్యతకు రాజీ వద్దు

రాజన్న ఆలయం, పట్టణ అభివృద్ధి రెండు కళ్లలాంటివి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ ప్రభాతవార్త



దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వేములవాడ 80 అడుగుల రహదారి విస్తరణ పనులు తుది దశకు చేరుకున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలో జరుగుతున్న రహదారి పనులను మున్సిపల్ పాలకవర్గం, అధికారులు, ప్రజలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. రహదారి దీర్ఘకాలం మన్నికగా ఉండేలా సాంకేతిక ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సూచించారు. రహదారి నిర్మాణానికి సుమారు 6.5 కోట్లు, విద్యుత్ స్తంభాలు, లైటింగ్ ఏర్పాట్లకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. రహదారి విస్తరణకు సంబంధించి 47 కోట్లతో జీవో తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. రాజన్న ఆలయం, వేములవాడ పట్టణ అభివృద్ధి రెండు కళ్లలాంటివని ఆది శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాజన్న ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు రూ.250 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులు సుమారు 55 శాతం, అన్నదాన సత్రం పనులు 50 శాతం పూర్తయ్యాయని చెప్పారు. అదనంగా రూ.99.40 కోట్ల నిధులు మంజూరయ్యాయని వివరించారు. వేములవాడను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆలయ అభివృద్ధి పనులు ఆగమ శాస్త్ర నియమాలకు అనుగుణంగా, భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా చేపడుతున్నట్లు తెలిపారు. శృంగేరి పీఠాధిపతి సూచనలను పరిగణనలోకి తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మూడో బ్రిడ్జి నిర్మాణ పనులను కూడా వేగవంతం చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో బిల్లుల చెల్లింపులకు జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వేములవాడ పట్టణ అభివృద్ధికి అవసరమైన నిధులను తీసుకొచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భీమేశ్వరాలయంలో కార్తీక మాస ఏర్పాట్ల పరిశీలన

భక్తులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం: ఈవో రమాదేవి

వేములవాడ ప్రభాతవార్త



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి క్షేత్రంలో కార్తీక మాస ఏర్పాట్లను ఈవో రమాదేవి, డీఈవో ప్రతాప నవీన్ కుమార్ పరిశీలించారు. కార్తీక మాసంలో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున, దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రత్యేక పూజా వేదికలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, దేవస్థాన ఉద్యోగులు, ఎస్పీఎఫ్ భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

# వేములవాడ వార్త

## జ్యోతిష్యంలో డాక్టరేట్ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సత్యనారాయణ

బోయిన్ పల్లి ప్రభాత వార్త



బోయిన్ పల్లి మండలం లోని బూరుగుపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయునిగా బోధిస్తున్న సత్యనారాయణ కు తిరుపతిలోని విశ్వ జ్యోతి విజ్ఞాన సంస్థ సనాతన ధర్మం వైదిక జ్యోతిష్య సమ్మేళనంలో వాస్తు జ్యోతిష్యం పై సుంకరాచార్య యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. డాక్టరేట్ సాధించిన సత్యనారాయణ ను పలువురు అభినందించారు.

## నిత్యవసర ధరలను ప్రభుత్వం నియంత్రించాలి

బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి అతికం రాజశేఖర్ గౌడ్

బోయిన్ పల్లి ప్రభాత వార్త



బోయిన్ పల్లి మండలం లో బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం నిత్యవసర ధరలను అదుపులో ఉంచాలని కోరారు. బ్లాక్ మార్కెట్లో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా నిత్యవసర ధరల రేట్లు పెంచడం వల్ల సామాన్యులపై తీవ్ర భారం పడుతుందని ప్రభుత్వం దీనిపై ప్రత్యేక చొరవ తీసుకొని నిత్యవసర ధరలకు కళ్లెం వేయాలని బ్లాక్ మార్కెట్ నిర్వహిస్తున్న నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలు సామాన్యులు మధ్యతరగతి ప్రజలు నిత్యవసర వస్తువులు కొనే పరిస్థితిలో భవిష్యత్తులో ఉండరని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. సామాన్యులు పేదలు మధ్యతరగతి ప్రజలకు పెను భారంగా మారిన నిత్యవసర వస్తువుల బ్లాక్ మార్కెట్ ను నియంత్రించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసి రాజ్యాధికార సమితి నాయకులు వెంకటేష్ ,గణేష్ ,సురేష్ ,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయానికి సరిపడా కరెంటును విడుదల చేయాలి

బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి

బోయిన్ పల్లి ప్రభాత వార్త



వ్యవసాయానికి సరిపడే విధంగా నిరంతరం కరెంటు ను ప్రభుత్వం విడుదల చేయాలని బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు సరిపడా పొలాలకు కరెంట్ లేక వరి పొలాలు ఎండిపోతున్నాయని అన్నారు. రైతులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం ప్రయత్నం చేయాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ముదిరాజులను బీసీడి నుంచి బీసీఏలో చేర్చే ప్రయత్నాలను విరమించుకోవాలి

బీసీఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గడప కోటేష్ కుమార్ డిమాండ్

.బోయిన్ పల్లి ప్రభాత వార్త



ముదిరాజులను బీసీడి జాబితా నుంచి బీసీఏ జాబితాలో చేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని బీసీఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గడప కోటేష్ కుమార్ డిమాండ్ చేశారు. ముదిరాజులను బీసీఏలో చేర్చడం వల్ల ఇప్పటికే ఆ జాబితాలో ఉన్న 57 కులాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీసీఏలోని కులాల హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణకు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వెనుకబడిన కులాల హక్కులకు భంగం కలగకుండా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు నేతలు పాల్గొన్నారు.

## చైర్మన్ ను పరామర్శించిన రామగుండం మేయర్

**రామగిరి ప్రభాతవార్త**

కమాన్ పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజును, అలాగే ఆయన సోదరుడు హనుమకొండ ప్రభుత్వ గవర్నమెంట్ ప్లీడర్ ను రామగుండం మేయర్ మహంకాళి స్వామి మంథని మున్సిపల్ చైర్మన్ వడ్నాల శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. గత నాలుగు రోజుల క్రితం వైనాల రాజు తండ్రి వై నాల సాంబయ్య మృతిచెందగా సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సాంబయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.వీరితో పాటు, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ పేరాల మహేశ్వరరావు,ముస్త్యాల సర్పంచ్ సుంకరిమహేందర్, చందనాపూర్ సర్పంచ్ కొండ మంజుల శ్రీనివాస్, కాంగ్రెస్ జీడి నగర్ మాజీ సర్పంచ్ సురా సమ్మయ్య బసంత నగర్ యూనియన్ కార్మిక సంఘం అధ్యక్షులు జిల్లా ప్రధాన కార్యదర్శి.. టిపిసిసి నాయకులు శ్రీనివాసు రామగుండం కార్పొరేటర్లు మారెల్లి రాజిరెడ్డి నాయకులు దశరథం బండ రమేష్ రెడ్డి మంథని వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి కౌన్సిలర్లు ఎల్లంకి వంశీ గుండా రాజు జంబోజు సమ్మయ్య ఎరుకల



లింగయ్య, మంతిని సిసిఎల్ అధ్యక్షులు మంతిని సత్యం, జనగామ కృష్ణ పెద్దపెల్లి జిల్లా డిఆర్డిఏ సీసీలు గుండారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచులు ఆకుల ఓదేలు, పిడుగు నరసయ్య గ్రామ శాఖ అధ్యక్షులు పిడుగు శంకర్ ఉప సర్పంచ్ రాజేందర్ వార్డు సభ్యులు దేవన్న, సీనియర్ నాయకులు హర్ష ఎల్లయ్య ముద్దాం కొమురయ్య మంథని నాయకులు పూదరి సర్వేష్ , బూడిద లింగన్న ఆకుల సత్యం హనుమకొండ అడ్వకేట్ అసోసియేషన్ నాయకులు బొల్లెపల్లి లక్ష్మణ్ , బొల్లెపల్లి కుమార్ , గొల్లపల్లి సాయి రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత

**ముత్తారం ఎస్ ఐ ఎన్. రవికుమార్**

**పోలీస్ అమరవీరులకు నివాళిగా కొవ్వొత్తుల ర్యాలీ**

**ముత్తారం, ప్రభాతవార్త:**

పోలీస్ అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ముత్తారం ఎస్ ఐ ఎన్.రవికుమార్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం కాసర్లగడ్డ సెంటర్ నుంచి సరస్వతి స్కూల్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో దాదాపు 50 మంది పాల్గొని, విధి నిర్వహణలో దేశ సేవకు, ప్రజల రక్షణకు తమ ప్రాణాలను అర్పించిన పోలీస్ అమరవీరులను స్మరించుకున్నారు. వారి త్యాగాలు, సేవలు, అంకితభావం సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజల భద్రతతో పాటు




శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులు చేస్తున్న కృషిని గుర్తుచేస్తూ, అమరవీరుల లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ ర్యాలీలో ముత్తారం పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## వట్టెంల సర్పంచ్ కౌంటర్.. బీఆర్ఎస్ ఆరోపణలు అవాస్తవం

**పోలీస్ రికార్డులతో ఆరోపణలను ఖండించిన రంగు వెంకటేష్**

**వేములవాడ రూరల్ ప్రభాతవార్త**

వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలను సర్పంచ్ రంగు వెంకటేష్ తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ చల్మెడ లక్ష్మీ ్మనరసింహారావు తమపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు.సంబంధిత వ్యక్తులపై 2023 అక్టోబర్ 14న బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కేసులు నమోదై, రౌడీషీట్లు తెరిచినట్లు పోలీసు రికార్డులను చూపిస్తూ వివరించారు. రాజకీయ ఉనికి కోసమే తమపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.గ్రామంలో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగిస్తూ, పారదర్శక పాలనతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే తమ లక్ష్ ్యమని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి సహకరించాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు.



## బీజేపీ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

**బీజేపీ పార్టీ నాయకులు ఆకుల రాజేందర్**

**బోయిన్ పల్లి ప్రభాత వార్త**

భారతీయ జనతా పార్టీ బోయిన్పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ గ నాయకత్వంలో బోయిన్పల్లి మండలంలోని పలు గ్రామాల్లో శక్తి కేంద్రాల వారిగా టిఫిన్ బైఠక్ నిర్వహించారు. విలాసాగర్ గ్రామంలో నిర్వహించిన టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో ఆకుల రాజేందర్ పాల్గొన్నారు..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆకుల రాజేందర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ, పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం, నాయకులు కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం టిఫిన్ బైఠక్ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఇటువంటి సమావేశాలు దోహదపడతాయని తెలిపారు.అదేవిధంగా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో నిర్వహించనున్న యువకుల ర్యాలీని విజయవంతం చేసేందుకు బోయిన్పల్లి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేస్తూ ర్యాలీ విజయవంతానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా నాయకులు సతీష్ కుమార్, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, స్తంభంపల్లి గ్రామ సర్పంచ్



బొంగానే అశోక్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు మెరుపుల గంగాధర్ గౌడ్, రాజేంద్రప్రసాద్, మండల ఉపాధ్యక్షులు ఇల్లందుల బాలయ్య, మోహన్ బాబు, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు సుంకపాక ప్రభు, యువ మోర్చా మండల అధ్యక్షులు మిరియాల శరత్ చంద్ర రెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు తిప్పర వేణి శ్రీనివాస్, మండల కార్యదర్శి మెనుకుల శ్రీనివాస్, సీనియర్ నాయకులు మారం ఉపేందర్, సారంపల్లి రాజు, మండల సోషల్ మీడియా కన్వీనర్ భాస్కర్ రెడ్డి, రేగుల రమేష్, బూర మనోజ్, నాగుల అనిల్, చల్ల కిరణ్, గొంటి రమేష్, వెన్నంపల్లి మహేష్, వెన్నంపల్లి అనిల్, మెరుగు రమేష్, మునిపాల సాగర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంథని వార్త

## మాజీ ఎంపీపీ తోట చంద్రయ్యను పరార్శించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి



**రామగిరి ప్రభాతవార్త**

రామగిరి మండలం ఉమ్మడి కమాన్పూర్ మాజీ ఎంపీపీ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తోట చంద్రయ్య ను పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గాండ్ల మోహన్ ఆదివారం పరమర్శించారు. ఇటీవల న్యూరో ప్రాబ్లంతో హైదరాబాదులోని ప్రముఖ చికిత్స కేంద్రంలో ట్రీట్మెంట్ తీసుకొని ఇటీవల సెంటనరి కాలనీలోని ఆయన స్వగృహం కు తిరిగి వచ్చిన సందర్భంగా పరమర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షి ంచారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కమాన్పూర్ మాజీ మండల అధ్యక్షుడు బొంపల్లి రాజయ్య కమాన్పూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజకుమార్ మాజీ ఎంపిటిసి శేవ్వశంకరయ్య రామగిరి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అవినాష్ మాజీఎంపిటిసి ముస్త్యాల శ్రీనివాస్ కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ కాటం సత్యం యూత్ కాంగ్రెస్ నాయకులు బిల్లా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు

**ముత్తారం, ప్రభాతవార్త:**



ముత్తారం మండలం కేశనపల్లి గ్రామంలో చొప్పరి అరవింద్ షాలిని దంపతుల కుమారుడు అధ్విక్ మొదటి పుట్టిన రోజు వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పిటిసి చొప్పరి సదానందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కతట్ల వినీత్, ఉప సర్పంచ్ సింగనవేన సదయ్య, కాంగ్రెస్ నాయకులు కందుల సమ్మయ్య, కార్యకర్తలున్నారు.

## 27న వేములవాడలో మెగా రక్తదాన శిబిరం

**వేములవాడ ప్రభాతవార్త**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విధి నిర్వహణలో ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరుల స్మారకార్థం ఈ నెల 27న వేములవాడలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు.బింగి మహేష్ ఫంక్షన్ హాల్‌లో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఎ. శ్రీనివాసులు, వేములవాడ టౌన్ సీఐ బి. వీరప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనుంది. యువత, రక్తదాతలు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేయాలని పోలీసులు కోరారు.

## భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ.

**.వేములవాడ ప్రభాతవార్త:**

దసరా, బతుకమ్మ సెలవుల ముగింపు, ఆదివారం సెలవు దినం కావడంతో వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు.అభిషేకాలు, అన్నపూజలు, కుంకుమ పూజలు, గండాదీపం, చండీ హోమం, నిత్య కల్యాణం తదితర ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రమాదేవి, డీఈవో ప్రతాప నవీన్ కుమార్ క్యూలైన్లు, ప్రసాద వితరణ, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## బస్సు ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ పై కేసు నమోదు

.జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

బస్సు ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట సిఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కమలాపూర్ మండలం కానిపర్తి గ్రామానికి చెందిన ఈసంపెల్లి లోకేష్ గత ఆరు సంవత్సరాల నుండి ఒక ప్రైవేటు బస్సు డ్రైవర్ గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడనీ వృత్తిలో భాగంగా ప్రతి రోజు లాగానే 25న రోజున తాను బస్సును తీ.వ్ని గిళీ 02 గిది 6088 నెంబర్ గల దానిని కుందనపెల్లి గ్రామం నుండి జమ్మికుంట వైపు వస్తుండగా కోరపెల్లి గ్రామ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ దాటే సరికి తనకి ముందు ఉన్న ఇసుకతో నిండిన ట్రాక్టర్ నడుపుతున్న డాక్టర్ డ్రైవర్ యునెస్ సలీం రోడ్డు




మధ్యలో అకస్మాత్తుగా బ్రేకు వెయ్యగా బస్సు ట్రాక్టర్ కు తగలగా బస్సు యొక్క ముంగటి బంపర్ మిర్రర్ రేడియేటర్ పైపులు పూర్తిగా ధ్వంసం అయినాయి. డ్రైవర్ కు,కండక్టర్ కు, ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు.బస్సు డ్రైవర్ లోకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా రోడ్డు మధ్యలో ట్రాక్టర్ బ్రేక్ వేసినా ట్రాక్టర్ డ్రైవర్ యూనిస్ సలీంపై కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.

## పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు..

ఇల్లందకుంట, ప్రభాతావార్త:

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని, పోలీసు సిబ్బంది ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షి స్తూ ఇల్లందకుంట ఎస్సై ఆధ్వర్యంలో ఆదివారం పోలీసు సిబ్బంది ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లందకుంటలోని శ్రీ సీత రామ చంద్ర స్వామి ఆలయంలో, సిరిసేడు చర్చిలో, సిరిసేడు మసీదులో ప్రార్థనలు నిర్వహించి, పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరవీరుల సేవలు చిరస్మరణీయమని



పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమం, పోలీసు సిబ్బంది శ్రేయస్సు, ప్రజల భద్రత మరియు సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

## అంతక్రియలో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి..

మానకొండూర్, ప్రభాతవార్త :

మండలంలోని లక్ష్మీ మ్మపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎల్ల సతీష్ కుమారుడు ఎల్ల రాకేష్ ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఆదివారం రాత్రి మృతుడి రాకేష్ అంతక్రియల్లో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని, మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకుడు రాజేష్ కుటుంబాన్ని ఎమ్మెల్యే ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎల్ల సత్యనారాయణ,



మార్కెట్ చైర్మన్ రేవల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రామిడి శ్రీనివాసరెడ్డి, ఊటూరు సొసైటీ చైర్మన్ మద్దసాని శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కాల్వ ధనేందర్, కాంగ్రెస్ నాయకులు రాపాక రాజేశ్వర్, ఎల్ల భగవాన్ రెడ్డి, కనవేని మదనయ్య, ఎల్ల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఫలించిన ఎమ్మెల్యే సంజయ్ కృషి

### సదర్మట్ బ్యారేజ్ నుంచి గంగానాలకు 8వందల క్యూసెక్కుల నీరు విడుదల

మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:

సదర్మట్ బ్యారేజ్ కింద గంగానాల ప్రాజెక్ట్ ద్వారా రైతులకు సాగునీరు అందించాలన్న కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్ కల్వకుంట్ల విజ్ఞప్తి ఫలించింది. మంగళవారం నుంచి 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు సదర్మార్ట్ బ్యారేజ్ ఈఈ జాదవ్ అనిల్ అంగీకరించినట్లు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో



పేర్కొన్నారు.ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి, యమాపూర్, ఫకీర్ కొండాపూర్, నడికుడ, మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట, ఓబులాపూర్, దామరాజ్‌పల్లి గ్రామాల రైతులకు సాగునీటి అవసరాలకు గంగనాల ప్రజల ద్వారా నీటి విడుదల జరగనుందని పేర్కొన్నారు. దీంతో ఆయా ప్రాంతాల రైతులకు ప్రయోజనం చేకూరనుంది. సాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే చేసిన కృషిపై ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పోలీసుల అమర త్యాగాలు మరువలేనివి

### రామగిరి పోలీసుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

రామగిరి ప్రభాతవార్త

విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం పనిచేసిన పోలీసుల అమర త్యాగాలు మరువలేనివని రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్ అన్నారు. పోలీసు అమరవీరుల స్మారకార్థం ఆదివారం సెంటినరీ కాలనీ తెలంగాణ చౌరస్తా నుండి కొవ్వొత్తులతో పన్నూరు క్రాస్ రోడ్ వరకు ర్యాలీ నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై తాడవేని శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమర పోలీసుల త్యాగాలను ప్రతి




ఒక్కరూ స్మరించుకోవాలని పేర్కొన్నారు. దేశ రక్షణ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామగిరి పోలీస్ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఇండియా స్కూల్ లీడర్ షిప్ అవార్డు అందుకున్న....వీణవంక మండల విద్యాధికారి.

వీణవంక, ప్రభాత వార్త:

వీణవంక మండల విద్యాధికారి ఎస్ శోభా రాణికి శనివారం న్యూ ఢిల్లీలో ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్ లో వరల్డ్ ఆలియన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ వారి ఆధ్వర్యములో2026 గాను ఇండియా స్కూల్ లీడర్ షిప్ సమితి అవార్డును అమెరికాకకు చెందిన డాక్టర్ రిసా నా వర్జీనియా, నేపాల్ కు చెందిన డాక్టర్ రవి స్వామి ,ఐఐటి ప్రొఫెసర్ శ్రీనిల్ కుమార్ చేతుల మీదుగా అందుకొన్నారు.ఈ అవార్డును అందుకున్నందుకు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాద్యా,ఉపాధ్యాయుని బృందం అభినందించారు.




# ధర్మపురి వార్త

## ధ్యాన సాధన తో ప్రశాంతత లభిస్తుంది



ధర్మపురి,ప్రభాతవార్త

ధ్యాన సాధన తో ప్రశాంతత లభిస్తుందని హైదరాబాద్ కు చెందిన హార్ట్ ఫుల్ నెస్ సంస్థ జోనల్ కోఆర్డినేటర్ ప్రదీప్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని బ్రాహ్మణ సంఘ భవనంలో ఆదివారం ఉదయం సామూహిక ధ్యాన సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులతో జన సాధన నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ధ్యాన సాధన చేయాలని, దాంతో మానసిక ప్రశాంతత తో పాటు ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రోటరీ క్లబ్ చార్టడ్ ప్రెసిడెంట్ మంచాల కృష్ణ, నిత్య యోగ సాధకులు తదితరులు పాల్గొన్నారు.

## ముక్తేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పూలు పండ్ల మొక్కలతో హరితవనం

గొల్లపల్లి, ప్రభాతవార్త:



మండలంలోని లక్ష్మీ మ్మపూర్ గ్రామంలో ఉన్న ముక్తేశ్వరస్వామి, శ్రీ గట్టు ఆంజనేయస్వామి ఆలయాల పరిసరాల్లో పూలు, పండ్ల మొక్కలతో హరితవనాన్ని ఏర్పాటు చేశారు. తేజ ఎర్త్ మూవర్స్ ప్రొప్రైటర్ చింతపండు తిరుపతి సుమారు రూ.70 వేల సొంత నిధులతో వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలను నాటి హరితవనాన్ని అభివృద్ధి చేశారు.ఆలయాలకు దర్శనానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడంతో పాటు, ఆలయ పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం హరితవనంలో మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారుఈ కార్యక్రమంలో న్యాయవాది పాదం తిరుపతి, ఆర్మీ జవాన్ తిరుపతి ,రాజు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడపరాదు సీఐ..




తిమ్మాపూర్, ప్రభాత వార్త

:తిమ్మాపూర్ మండల కేంద్రంలోని రేణికుంట టోల్ ప్లాజా వద్ద తిమ్మాపూర్ సిఐ అనిల్,ఎస్ఐ అరుణ్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రాణాల మీదికి తెచ్చుకునే వారిని అడ్డుకునేందుకు ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్టు సీఐ తెలిపారు. వాహనదారులు తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకునేందుకు రోడ్డు భద్రత సూచనలు పాటించలని కోరారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్, గన్నేరువరం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలు చిరస్మరణీయం..!

## పోలీసు కుటుంబాలకు శాఖ అండగా ఉంటుంది

## సీ.ఎస్.ఐ చర్చిలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవ ప్రార్థనలు





కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం, ప్రజల రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహిస్తూ ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల సేవలను స్మరించుకుంటూ, వారి కుటుంబాలకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక సీ.ఎస్.ఐ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. పోలీసు అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని చర్చి పాస్టర్లు, ఫాదర్లతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజల భద్రత కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సామరస్యాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు.

### ప్రజల రక్షణే లక్ష్యంగా విధులు

పోలీసు శాఖలో విధి నిర్వహణ అనేక సవాళ్లతో కూడుకున్నదని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతోపాటు శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అత్యవసర పరిస్థితులు, నేరాల నియంత్రణ, ప్రజా భద్రత వంటి అంశాల్లో పోలీసులు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం పనిచేసిన అమరవీరుల సేవలను ఎప్పటికీ మరువలేమన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు వారి త్యాగాలను గుర్తుచేసుకోవడంతోపాటు, సమాజ భద్రత కోసం వారు చేసిన సేవలను స్మరించుకునే సందర్భమని తెలిపారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా పోలీసులు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.

### కుటుంబాలకు పోలీసు శాఖ అండ

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీపీ గౌష్ ఆలం పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాల సంక్షేమం, వారి అవసరాల పట్ల శాఖ బాధ్యతగా వ్యవహరిస్తుందని తెలిపారు. కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధను పూడ్చలేకపోయినా, వారికి భరోసా కల్పించేందుకు అవసరమైన సహకారం అందించడం ముఖ్యమన్నారు. పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ఎదుర్కొనే ఒత్తిళ్లు, సవాళ్లను దృష్టిలో ఉంచుకుని వారి క్షేమం కోసం ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలని, ప్రజలకు అంకితభావంతో సేవలందించే శక్తిని పొందాలని ఆకాంక్షించారు.

### మతసామరస్యానికి ప్రతీకగా ప్రార్థనలు

సమాజంలో మతసామరస్యం, సోదరభావం మరింత బలోపేతం కావాలని చర్చి ప్రతినిధులతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. వివిధ మతాలు, వర్గాలకు చెందిన ప్రజలు పరస్పర గౌరవంతో కలిసిమెలిసి జీవించినప్పుడే సమాజంలో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీ గౌష్ ఆలం వెంట ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, టౌన్, ట్రాఫిక్ సీఐలు, ఎస్సైలు, పోలీసు అధికారులు, సిబ్బంది, సీ.ఎస్.ఐ చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

# నగరాభివృద్ధికి పెద్దపీట వేస్తాం.

## కరీంనగర్,మేయర్ కొలగాని శ్రీనివాస్...

కరీంనగర్,ప్రభాతవార్త : కరీంనగర్ నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని 2వ డివిజన్ సరస్వతినగర్‌లో యూడీఐఎఫ్ నిధులు రూ.40.70 లక్షలతో చేపట్టనున్న ఆర్ సీసీ పైపులైన్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమీ పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం డివిజన్ వాసులు మేయర్‌కు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలతో సత్కరించారు. అభివృద్ధి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. 8వ డివిజన్ అలుగునూరులో మేయర్ కొలగాని శ్రీనివాస్ పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వరంగల్ రోడ్డుతో పాటు హైదరాబాద్ చేపలకాలనీ ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ కాల్వ మల్లేషంతో కలిసి స్థానిక ప్రజల అవసరాల కోసం వారసంతను ప్రారంభోత్సవం చేశారు. అనంతరం,బస్సు షెల్టర్లను ప్రారంభం చేశారు. ఈ సంధర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిదిలోని 66 డివిజన్ల లో యూసిఎఫ్ కు చెందిన 50 కోట్ల నిధులతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా కాంట్రాక్టర్లు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సహకారంతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కరీంనగర్ నగరపాలక సంస్థకు రూ.840 కోట్ల నిధులు సమకూరినట్లు తెలిపారు. ఈ నిధులతో చేపట్టనున్న పనులకు సంబంధించిన డీపీఆర్‌కు ఇటీవల ఆమోదం లభించిందని, త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టులు అమలైతే నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. నగరంలో వీధికుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు మేయర్ తెలిపారు. 66వ డివిజన్ పరిధిలో ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) సెంటర్‌ను ప్రారంభించినప్పటికీ, అవసరమైన సదుపాయాలు, సామర్థ్యం పెంపునకు మరిన్ని చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. స్మార్ట్ సిటీ నిధుల కింద సుమారు రూ.2 కోట్లతో ఏబీసీ సెంటర్‌కు సంబంధించిన పనుల టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 8 వ డివిజన్ లో రెండు వారసంత మార్కెట్లను ప్రారంభించినట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు అవసరమైన వస్తువులు అందుబాటులో ఉండటంతో పాటు, చిన్న వ్యాపారులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఈ మార్కెట్లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని కోరారు. భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ప్రజలంతా బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హానికరమని మేయర్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని, వాటి వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని సూచించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.






# సింగరేణి భూముల్లో సొంతింటి కలకు కార్యాచరణ!

## 1,250 ఎకరాల్లో పట్టాల పంపిణీకి కసరత్తు

## 5,774 ఎకరాల భూమి బదలాయింపుపై ప్రభుత్వ ప్రకటన

## శిథిలవస్థ క్వార్టర్ల స్థానంలో ఆధునిక గృహాల ప్రతిపాదన

## రామగుండం బొగ్గు బెల్ట్‌లో అమలుపై కార్మికుల ఆశలు

గోదావరిఖని, ప్రభాతవార్త: సింగరేణి కార్మిక కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం భూముల వినియోగం, ఇంటి స్థలాల పట్టాల పంపిణీ, పాత క్వార్టర్ల స్థానంలో కొత్త గృహాల నిర్మాణంపై ప్రణాళికను ప్రకటించింది. సంస్థకు చెందిన వినియోగంలో లేని భూములను గుర్తించి నివాస అవసరాలకు ఉపయోగించడంతోపాటు, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అక్టోబరు 13న అధికారులను ఆదేశించారు. అయితే ఈ ప్రకటనకు సంబంధించి క్షేత్రస్థాయి కార్యాచరణ, లబ్ధిదారుల గుర్తింపు, నిర్మాణ గడువులపై స్పష్టత రావాల్సి ఉంది.

### భూముల బదలాయింపుపై దృష్టి

సింగరేణికి సంబంధించిన సుమారు 5,774 ఎకరాల భూమి రెవెన్యూ శాఖకు తిరిగి బదలాయించినట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో సుమారు 4,500 ఎకరాల్లో గతంలో పేదలకు ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన సుమారు 1,250 ఎకరాల్లో అర్హులను గుర్తించి పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. నెలలోగా అర్హుల జాబితా సిద్ధం చేయాలన్న లక్ష్యంతో జిల్లా యంత్రాంగం, సింగరేణి అధికారుల సమన్వయం కీలకం కానుంది. అయితే ఈ భూముల్లో ఎంతమంది కార్మిక కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుంది? ఏ ప్రాంతాల్లో పట్టాలు పంపిణీ చేస్తారు? అనే అంశాలపై తుది వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

### పాడుబడ్డ క్వార్టర్ల స్థానంలో కొత్త ఇళ్లు

సింగరేణి కాలనీల్లో శిథిలావస్థకు చేరిన డిటైప్ క్వార్టర్ల సమస్యను పరిష్కరించేందుకు ఆధునిక గృహాలు నిర్మించాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. తాగునీరు, పారిశుద్ధం, డ్రైనేజీ వంటి మౌలిక వసతులతో నివాస ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కాలనీలకు మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరు పెట్టాలని కూడా సూచించింది. అయితే కొత్త ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు, స్థలాల ఎంపిక, నిర్మాణ గడువులు, ప్రస్తుతం క్వార్టర్లలో నివసిస్తున్న కుటుంబాలకు ప్రత్యామ్నాయ వసతి వంటి అంశాలపై కార్యాచరణ వెల్లడికావాల్సి ఉంది.

### అమలుపైనే కార్మికుల ఆశలు

రామగుండం, గోదావరిఖని సహా బొగ్గు బెల్ట్ ప్రాంతాల్లో సింగరేణి కార్మిక కుటుంబాలకు గృహవసతి కీలక అంశంగా ఉంది. ఉద్యోగ జీవితమంతా సంస్థకు సేవలందించిన కార్మికులకు సొంత స్థలం లేదా ఇల్లు సమకూరడం భవిష్యత్తుకు భరోసానివ్వనుంది. ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళిక లక్ష్యాలు నెరవేరాలంటే భూముల గుర్తింపు, అర్హతల నిర్ధారణ, పట్టాల పంపిణీ, గృహ నిర్మాణానికి సంబంధించి స్పష్టమైన గడువులు నిర్ణయించాలి. ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రభుత్వ ఉత్తర్వులు, లబ్ధిదారుల జాబితా, నిధుల కేటాయింపులు వెలువడినప్పుడే ఈ పథకం అమలు వేగంపై స్పష్టత రానుంది.

